


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 23.11.2025 | సంపుటి : 2 | సంచిక :289 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Sunday | 23.11.2025 | volume : 2 | Issue : 289 | Pages : 8 | Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575





# అందెశ్రీ కోహినూరు వజ్రం

ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు

కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు

ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు

అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు.

మిగతా 2 లో

# 37 మంది మావోయిస్టులు లొంగుబాటు

## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్



లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్

గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డిజిపి

మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

02

## తెలంగాణలో డిసిసి అధ్యక్షుల నియామకాలు

పలుచోట్ల ఎమ్మెల్యేలకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు

న్యూఢిల్లీ, నవంబర్ 22 : తెలంగాణలో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఖాళీగా ఉన్న డిసిసి పదవులను భర్తీ చేసింది. క్షేత్రసత్యాయిలో ప్రజలను సమీకరించేందుకు ఎమ్మెల్యేలకు పలుచోట్ల బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో తెలంగాణ డీసీసీలకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. 30 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్

-మిగతా 2 లో..

## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి

సాయ సమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్




పుట్టపర్తి,నవంబర్22 : సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 22 విశిష్టత గురించి సీఎం చెప్పగానే వస్తానని చెప్పా. ఇప్పటికే దేశంలో ముగ్గురు ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించారు. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా

-మిగతా 2 లో..

## విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి

సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం

పుట్టపర్తి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము




పుట్టపర్తి,నవంబర్22 : సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శ్రీసత్యసాయి శత జయంతి వేడుక ల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న అనంతరం రాష్ట్రపతి ప్రసంగించారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని రాష్ట్రపతి అన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందని ప్రభావితం చేశాయని అన్నారు. లక్షలాది మందికి మార్గం చూపాయని వ్యాఖ్యానించారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని

-మిగతా 2 లో..



## అల్పపీడన ప్రభావం

తెలంగాణకు రెండురోజులు వర్ష సూచన

హైదరాబాద్, నవంబరు 22 : తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మలక్కా

-మిగతా 2 లో..

## కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో 'అగ్రగామి'గా తెలంగాణ

విద్యా వ్యవస్థలో 'మార్పు' తేవాలన్నదే సంకల్పం

యువతకు స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్ - స్కిల్లింగ్ పై ఫోకస్

జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్' లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్: విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

-మిగతా 2 లో..

## 50శాతం రిజర్వేషన్లపై పంచాయితీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు.

02

## పోలీసుల విచారణలో సహకరించని రవి

తెలియదు.. గుర్తు లేదు.. మరిచిపోయా

విదేశీ సంస్థలతో సంబంధాలపై మౌనం

మూడోరోజు ముగిసిన విచారణ



హైదరాబాద్, నవంబరు 22 : సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు

-మిగతా 2 లో..

## నేడు భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు

హిడ్మా, తదితరుల ఎన్‌కౌంటర్‌పై నిరసన.. అప్రమత్తం అయిన పోలీసులు

విజయవాడ, నవంబరు 22 : మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఆదివారం దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ ప్రతినిధి అభయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తనిఖీలు

-మిగతా 2 లో..





## స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తా

స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి

(మొదటిపేజీ తరువాయి)

కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు ఆమె వెంట ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి చంద్రబాబు, లోకేశ్ ఘన స్వాగతం పలికారు.

### సత్యసాయి ఆశిస్సులతో
## అగ్రస్థానానికి భారత్

(మొదటిపేజీ తరువాయి)

నాయకులను తయారు చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ ఆహ్వానించగానే అందరూ స్వాగతించారు. విద్యార్థులు దేశ నాయకులుగా ఎదుగుతారనేందుకు ఇదే నిదర్శనం. జీవితంలో ప్రతి రోజూ చాలా కీలకం. మానవ జీవితాలు యాంత్రికంగా, ఆధ్యాత్మికంగా సాగుతున్నాయి. విద్యాసంస్థ ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం నేర్పుతున్నారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యాసంస్థ విలసిల్లుతోందని ఉప రాష్ట్రపతి అన్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం.. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. వ్యక్తిత్వ కేంద్రంగా సత్యసాయి వర్సిటీ నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో సత్యసాయిబాబా భూమిపైకి వచ్చారు. సత్యసాయి.. భగవాన్ సాయి సిద్ధాంతం వ్యాప్తి చేశారు. క్రమశిక్షణ, ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. భారత్.. వేల ఏళ్లుగా ఆధ్యాత్మిక భావనలతో వర్ధిల్లుతోంది. వసుధైక కుటుంబం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనేది మన సంస్కృతిలో ఉంది. సత్యసాయి విద్యాసంస్థ నైతికత, విలువలతో కూడి ఉంటుంది. విద్యార్థులకు ఆధ్యాత్మికత, సేవాభావాన్ని విద్యాసంస్థ నేర్పిస్తుంది. అందరినీ ప్రేమించాలి.. సేవ చేయాలి అనేది భగవాన్ సాయి సిద్ధాంతం. సహాయ గుణం కలిగి ఉండాలే కానీ, ఎవరినీ నొప్పించవద్దనేది సిద్ధాంతం. సత్యం, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు సూత్రాలు చెప్పారని సీఎం అన్నారు.



## ముగిసిన రాష్ట్రపతి పర్యటన

**హైదరాబాద్, నవంబర్ 22 :** హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన ముగిసింది. ఒకరోజు పర్యటన కోసం వచ్చిన ఆమె శనివారం మధ్యాహ్నం ఇక్కడి నుంచి పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డిలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిఎం ముర్ముకు జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌ను మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్ కలుసుకున్నారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు తెలిపారు. యాదవ్‌ను సిఎం సాదరంగా ఆహ్వానించారు.

## స్థానిక ఎన్నికల్లో 50శాతం మించకుండా రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుముదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో నకిలీ లేడీ ఖాకీ పట్టివేత
### పోలీస్ డ్రెస్‌లో ఏకంగా వివిపి డ్యూటీ

**హైదరాబాద్, నవంబర్ 22 :** హైదరాబాద్‌లో నకిలీ ఖాకీ వ్యవహారం వెలుగుచూసింది. జీడిమెట్ల పోలీసు పరిధిలో నకిలీ లేడీ కానిస్టేబుల్‌గా వ్యవహరించిన ఉమాభారతి అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కానిస్టేబుల్ పోస్టుకి సెలెక్ట్ కాలేకపోయినా, తాను పోలీసు సిబ్బందిలోనే పనిచేస్తున్నట్లు చాటుకునేలా ఖాకీ డ్రెస్ కొనుగోలు చేసి, పలు వీఐపీ కార్యక్రమాలకు బందోబస్తు డ్యూటీలు చేసిన విషయం బయటపడింది. తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, పోలీసులలో పనిచేయాలనే కోరికతో ఉమాభారతి ముందుగా డ్రెస్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాదులో జరిగిన కీలక వీఐపీ కార్యక్రమాల్లో.. సచివాలయంలో జరిగిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాల ఊరేగింపు వంటి ఈవెంట్లలో బందోబస్తుల పేరుతో తిరిగినట్లు వెల్లడైంది. సైబరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి కూడా వెళ్లి, అక్కడి క్యాంటీన్‌లో గడిపి వెళ్లిపోయిన విషయం విచారణలో బయటపడింది. అంతేకాకుండా పలు కాలేజీల్లోకి వెళ్లి 'సైబర్ క్రైమ్ అవేర్‌నెస్' పేరుతో లెక్చర్లు ఇచ్చిందని కూడా పోలీసులు గుర్తించారు. ఒక దశలో ఉమాభారతి ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను ప్రశ్నించడంతో మొత్తం నకిలీ ఖాకీ డ్రామా బట్టబయలైంది. అసలు పోలీసు ఉద్యోగం లేకపోయినా, అధికారులు, సిబ్బంది తెలియకుండా వీఐపీ డ్యూటీలను కూడా ఎలా చేసిందన్న దానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు. అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. . తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు. ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో..



అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.

## విద్యా వ్యవస్థలో 'మార్పు' తేవాలన్నదే సంకల్పం

(మొదటిపేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లిలోని జేఎన్టీయూ హెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ - 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్య మిస్తోందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఏఐ'లో బెంచ్ మార్క్‌ను సెట్ చేసేలా అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో త్వరలోనే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరిచిపోవద్దని, సమాజానికి తిరిగి ఇవ్వడం కృతజ్ఞతతో కూడిన బాధ్యత అని అన్నారు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రశ్నించే అవకాశాన్ని పొందగలమన్నారు. జేఎన్టీయూహెచ్ లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్




క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్, గ్లోబల్ అల్యూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులను కోరారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువ ఇంజనీర్ల ఆలోచన విధానం మారాలని, ఉద్యోగార్థిగా కాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర రావు, రెక్టార్ డా.కె.విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలియదు.. గుర్తు లేదు.. మరిచిపోయా

(మొదటిపేజీ తరువాయి)

ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు



చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

## చిరుత దాడిని తిప్పికొట్టిన చిన్నోడు
### ధైర్యంగా ఎదుర్కొన్న 11 ఏళ్ల బుడతడు

**ముంబై, నవంబర్ 22 :** చిరుతపులి ఎదురైతే పరుగో పరుగు అంటాం. కానీ ఒక చిన్నపిల్లవాడు ధైర్యంగా చిరుతతో పోరాడిన తీరును చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇంతకీ ఆ చిన్నారి వయసు ఎంతో తెలుసా.. కేవలం 11 ఏండ్లు మాత్రమే. ఇంత చిన్న ప్రాయంలో ఎదురుగా మృత్యుదేవతలా చిరుత ఉంటే అంత ధైర్యంగా పోరాడటం నిజంగా ఆశ్చర్యకరమే. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలోని కాంచడ్ ప్రాంతంలో పదకొండేళ్ల కువారా అనే బాలుడు పాఠశాల నుంచి తిరిగి వస్తుండగా వెనుక నుంచి చిరుతపులి దాడి చేసింది. తాను వేసుకున్న బ్యాగ్‌పై చిరుత పంజా విసిరిన వెంటనే అప్రమత్తమైన బాలుడు గట్టిగా కేకలు వేస్తూ.. తన స్నేహితుడితో కలిసి ఆ చిరుతపై ఎదురు దాడి చేయడం ప్రారంభించారు. ఆ చిన్నారి రాళ్లను చిరుతపులిపై విసరడం, అలాగే ఆ చిన్నారి తోటి స్నేహితులు కేకలు విని దగ్గర్లోని ప్రజలు కర్రలు, రాళ్లతో పరిగెత్తి రావడం చూసిన చిరుత వెంటనే అడవిలోకి పారిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుత దాడి చేసినప్పుడు కూడా భయపడకుండా ధైర్యం, సమయస్ఫూర్తితో దానిని తరిమికొట్టిన కువారాను అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. చిరుతపులిని గుర్తించడానికి కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నామని, బోన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. చిరుత దాడిలో కువారా చేతికి గాయం కావడంతో చిన్నారిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వాస్తవానికి చిరుత దాడి సమయంలో విద్యార్థి స్కూల్ బ్యాగ్ వేసుకొని ఉండడం వల్ల పెను ప్రమాదం తప్పిందని చెప్పారు.

## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు



అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

## తెలంగాణలో డిసిసి అధ్యక్షుల నియామకాలు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ వారి పేర్లు వెల్లడించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ - డాక్టర్ నరేష్ జాదవ్,ఆసిఫాబాద్ - ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం -దేవి ప్రసన్న, భువనగిరి - బీర్ల ఐలయ్య, గద్వాల - రాజీవ్ రెడ్డి, హన్మకొండ - ఇనిగాల వెంకట్రామి రెడ్డి, హైదరాబాద్ - సయ్యద్ ఖలీద్ సహిఫుల్ల జగిత్యాల - నందయ్య, జనగాం - ధన్వంతి, జయశంకర్ - భూపాల పల్లి కరుణాకర్,కామారెడ్డి - మల్లికార్జున ఆలెలను నయిమించారు. ఇందులో కొందరు కార్పోరేషన్ ఛైర్మన్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## అల్పపీడన ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

జలసంధిలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఉదయం 8.30 గంటలకు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తర్వాతి 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం సైతం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పొడి వాతావరణం ఉంటుందని వివరించింది.



## నేడు భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో.. నిరాయుధులైన హిడ్మా, అతడి భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులను ఏపీ పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకుని ఆ తరువాత మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కాల్చి చంపి, దానిని ఎన్‌కౌంటర్‌గా చెప్పుకున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా చికిత్స కోసం విజయవాడకు వచ్చారని, విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఎస్ఐబీ పోలీసులు అతన్ని పట్టుకుని.. 15న అరెస్ట్ చేసి, 18వ తేదీన హిడ్మాను బుటకపు ఎన్ కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ప్రతినిధి అభయ్ ఆరోపించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ సంఘం సీనియర్ నాయకుడు మనీష్ కుంజా కూడా ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. తాడిమెట్ల, జీరంఘాట్ ఘటనల్లో మాద్వి హిడ్మా ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాకు చెందిన కొంత మంది పార్టీకి చెందిన నాయకులే హిడ్మా కదలికలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో దేవ్‌జీ పాత్ర ఉందని తెలుస్తుంద ని చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఎన్‌కౌంటర్‌ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భారత్ బంద్‌కి పిలుపునివ్వడంతో.. భ ద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ఏరియాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రజా ప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాలను విడిచి మైదాన ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు సూచనలు చేశారు.

రెండేండ్ల విజయోత్సవాలు ప్రతిబించేలా..

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- తెలంగాణ పారిశ్రామిక విధానంపై సమగ్ర ప్రకటన
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, నవంబర్ 22 :** డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచిం చారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్,సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదు-పాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సీఎం ఆదేశించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంతో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాలుపంచుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశిరచుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్ కు తుదిరూపం ఇస్తామని అభిప్రాయపడ్డారు.



## పెద్దపల్లి జిల్లాలో ఇసుక మాఫియా దారుణం

### చెక్ డ్యామ్‌ను కూల్చేసిన దుండగులు

**పెద్దపల్లి, నవంబర్ 22 :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామంలో గల చెక్ డ్యాము ను గుర్తు తెలియని దుండగులు పేల్చివేశారు. గుంపుల మానేరు వద్ద గల చెక్ డ్యాం ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పేల్చి వేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గుంపుల మానేరుపై ఉన్న చెక్ డ్యామ్ ను సుమారుగా 19 కోట్లతో నిర్మించిన ఈ చెక్ డ్యామును, వ్యవసాయ భూమికి వినియోగించుకునే నీరు సుమారు 6 వేల ఎకరాల భూమి సాగు వినియోగంలో ఉండేదని ఈ ఇసుక మాఫియా దుండగులు రాత్రి రాత్రి పేల్చి పేల్స్ వేసి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని రైతులు ఆందోళన చెందారు. గుంపుల మానేరు ఒడ్డున ఉన్న దేవాలయానికి సుమారుగా రోజుకు 500మంది భక్తులు వచ్చి ఇక్కడ పుణ్య స్థానాలు ఆచరించి దేవుని దర్శనం చేసుకొని వెళ్లేవారని ఈరోజు ఈ చెక్ డాం పేల్చివేయడంతో వాటర్ అంతా కిందికి వెళ్లిపోయాయని దానివల్ల భక్తులకు ఆటంకం ఇబ్బందులకు గురైనట్లుగా తెలిపారు. చెక్ డ్యామ్ ను పేల్చివేసిన ఇసుక మాఫియా దుండగులపై వెంటనే చర్యలు చేపట్టాలంటే గ్రామస్తులు కోరుతున్నారు.

## సున్నం చెరువు పునరుద్ధరణలో తొలగిన అడ్డంకి

### ఎఫ్‌టిఎల్‌లో ఉన్న గుడి, ప్రార్థనా స్థలం తరలింపునకు ఓకే

**హైదరాబాద్, నవంబర్ 22 :** హైదరాబాద్‌లోని సున్నం చెరువు పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్న హైడ్రా అధికారులు శనివారం స్థానికులతో కీలక సమావేశం నిర్వహించారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి, ముస్లింల ప్రార్థనా స్థలం 'చిల్లా' మార్పు గురించి ఇరుపక్షాల అభిప్రాయాలను హైడ్రా కమిషనర్ స్వయంగా నివాసితులతో మాట్లాడి తెలుసుకున్నారు. చెరువు పునరుజ్జీవనంలో భాగంగా ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను గట్టు వైపు మార్చాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించగా, రెండు వర్గాల స్థానికులూ ఈ నిర్ణయానికి అంగీకారం తెలిపారు. సున్నం చెరువు కూడా హైడ్రా చేపట్టిన ప్రధాన పునరుద్ధరణ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉన్నందున, చెరువు అసలు పరిమితిని కాపాడటం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ఆక్రమణలను తొలగించడం వంటి కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ పక్రియలో ఆంజనేయుని గుడి, చిల్లా ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుండటంతో, వాటి పునర్వ్యవస్థీకరణపై గత కొంతకాలంగా సమీక్ష జరుగుతోంది. శనివారం జరిగిన ఈ సమాలోచనలో ఇరువర్గాల నివాసితులు పూర్తిగా సహకరిస్తామని హైడ్రాకు హామీ ఇవ్వడం ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యకు తెరపడింది. పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ముందుకు సాగేందుకు ఈ అంగీకారం ఎంతో సహాయకారి అవుతుందని హైడ్రా అధికారులు తెలిపారు. చెరువు భద్రత, అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో ప్రజల సహకారం అత్యంత కీలకమని కమిషనర్ సమావేశంలో పేర్కొన్నారు.

## 2047నాటికి 3 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- అన్నపూర్ణ స్టూడియోను సందర్శించిన భట్టి
- ఫిల్మ్, మీడియాలో విద్యార్థుల సృజనాత్మకతకు ఫిదా
- నాగార్జున దంపతుల పట్టుదలకు అభినందన



**హైదరాబాద్,నవంబరు 22 :** 2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ లక్ష్యంలో చిత్ర పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భవిష్యత్తును నిర్మించడంలో చిరంజీవి, అక్కినేని నాగార్జున వంటి సీనియర్ సినీ దిగ్గజాల మద్దతు కోసం మేము ఎదురుచూస్తున్నామని అన్నారు. మంగళవారం అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ / మీడియాను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. 1970లో కనీస మౌలిక సదుపాయాలు లేని ఈ ప్రాంతంలో దిగ్గజ అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోలను ఎలా స్థాపించారో, అప్పటి నుండి అది హైదరాబాద్‌లోని అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక మరియు సినిమాటిక్ ల్యాండ్‌మార్క్‌లలో ఒకటిగా ఎలా ఎదిగిందో గుర్తుచేసుకుంటూ, సంస్థ యొక్క గొప్ప వారసత్వాన్ని భట్టి విక్రమార్క ప్రశంసించారు. అన్నపూర్ణ కళాశాలలో ప్రపంచ స్థాయి చలనచిత్ర విద్య ద్వారా ఈ



దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో నాగార్జున అక్కినేని, అమల అక్కినేని విజన్ ను ఆయన అబినందించారు. అన్నపూర్ణ కళాశాల విద్యార్థులు రూపొందించిన రోల్ నంబర్ 52ని నేను చూశాను. నాకు ఎంతగానో నచ్చింది, మనసుని హత్తుకునే మంచి సినిమా తీసినందుకు దర్శకుడిని వారి టీమ్ ను అభినందిస్తున్నాను. అన్నపూర్ణ కళాశాలలో ఎందరో ప్రతిభావంతులు, వారి ప్రతిభ గురించి అక్కినేని నాగార్జున స్వయంగా నాతో మాట్లాడారు, అదే నన్ను ఇన్స్పైర్ చేసింది. మీ అందరిని కలవడానికే ఇక్కడికి వచ్చానని అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ ' నా తండ్రి తెలుగు చిత్ర పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలి వచ్చినపుడు ఆయన విజన్ కు అనుగునంగా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించబడింది. నేడు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారతదేశంలోని అత్యుత్తమ సంస్థలలో అన్నపూర్ణ స్టూడియోస్ ఒకటిగా నిలిచింది. అన్నపూర్ణ కళాశాల భవిష్యత్ కథకులను పెంపొందించాలనే తన కలను కొనసాగిస్తోంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు మా స్టూడియోస్ ను సందర్శించడం మాకు గౌరవంగా ఉంది. ప్రపంచ సినిమాలో తెలంగాణ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి మేము ఎప్పుడు రెడీగా ఉంటామమని అన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రి అన్నపూర్ణ స్టూడియోస్, సౌండ్ / విజన్ భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ ఫెసిలిటీ సినిమాను కూడా సందర్శించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు మరియు అత్యాధునిక సాంకేతికత వివరాలు అడిగి తెల్సుకుని నాగార్జునను మెచ్చుకున్నారు.

## భూ కుంభకోణంపై బీజేపీ ఎందుకు స్పందించడం లేదు

### మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్:** పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. " భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు.. ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100% నుంచి 200% అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు? 7 రోజుల్లో ఆమోదాలు? 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ? ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన ప్రక్రియ? రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారు. మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే ప్రక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్ఆర్ అవతలకు పంపించాలనేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదు" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

మహిళల ఆత్మగౌరవం ఇనుమడించే కార్యక్రమం

## ఇందిరమ్మ చీరల పంపిణీ

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్, నవంబరు 22 :** మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ కలెక్టరేట్ లో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని, నిపుణులైన ఉపాధ్యాయులు, మెరుగుపడిన సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని సూచించారు. కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన వారందరికీ చీరలు పంపిణీ జరిగేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో మహిళలకు నాణ్యమైన చీరలు

### ఇందిరమ్మ చీరల పంపిణీలో మంత్రి శ్రీహరి

**మక్తల్, నవంబరు 22 :** ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణంలో మహిళలకు శనివారం ఇందిరమ్మ చీరలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను నాణ్యమైన చీరలు అందజేస్తుం దన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. డిసెంబర్ ఒకటిన రూ.4,500 కోట్ల బ్జడెట్‌తో మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. మక్తల్- నారాయణపేట 4 లేన్ ల రహదారికి, నియోజక వర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు

## 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**హైదరాబాద్, నవంబరు 22 :** తెలంగాణలో తొమ్మిది మంది నాన్ క్యాడర్ ఎస్పీలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్ ఎస్పీలుగా పీ కరుణాకర్, ఎస్వీఎన్ శివరామ్, ఆర్ జగదీశ్వర్‌రెడ్డిని బదిలీ చేసింది. సైబరాబాద్ ఎస్‌బీ డీజీపీగా వైవీఎస్ సుధీంద్ర, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా సాయిశ్రీ నియామకమయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా వి అరవింద్ బాబు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా ధార కవిత, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా ఎం రవీందర్‌రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఎన్ అశోక్ కుమార్ బదిలీ నియామకమయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం ప్రభుత్వం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టింది. 32 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎంబీఏ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నవంబరు 22 :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## ఓఆర్ఆర్‌పై దారుణం.. దైవదర్శనానికి వెళ్తూ మృత్యు ఒడికి

**శంషాబాద్:** దైవ దర్శనానికి బయలుదేరిన ఓ వ్యక్తిని మృత్యువు కబళించింది. ఈ హృదయ విదారక ఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధి పెద్దగోల్కొండ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన కాముని భరత్ (26) అవివాహితుడు. తన కారులో ముగ్గురు బంధువులను తీసుకొని కొల్లాపూర్‌నకు దైవ దర్శనానికి ఓఆర్ఆర్ మీదుగా బయలుదేరాడు. పెద్దగోల్కొండ ఎగ్జిట్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు కారును ఢీకొట్టి వెళ్లిపోయింది. రోడ్డు మధ్యలో ఆగిన కారును పక్కన తీసేందుకు ముగ్గురు నెడుతుండగా భరత్ స్టీరింగ్ తిప్పుతున్నాడు. ఈక్రమంలో మరో ట్రక్కు వేగంగా ఢీకొట్టి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన భరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి తృటిలో ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## అప్పుల బాధతో ముగ్గురి ఆత్మహత్య

**అంబర్‌పేట:** హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అప్పుల బాధ తాళలేక భార్య, భర్త, పదేళ్ల కుమార్తె ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెండ్రోజుల క్రితమే బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయి. కొద్ది నెలల క్రితమే ఈ కుటుంబం రామ్‌నగర్ నుంచి అంబర్‌పేటకు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే పెద్ద కుమార్తె మరణించడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సుప్రీం తీర్పు.. గవర్నర్ల వ్యవహారం!



**పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది.**

గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది.

అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవా లని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది. రాష్ట్రపతి రాజ్యాంగాధినేత కావడం వల్ల కొంత ఆలోచన చేయవచ్చు. కానీ గవర్నర్లు ఈ విషయంలో కొంత రాజ్యాంగబద్దంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే బిల్లులను తొక్కిపెట్టి కాలయాపన చేయడం వల్ల తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయి.

సుప్రీం తీర్పు తరవాత తమిళనాడు సిఎం స్టాలిన్ కూడా స్పందించారు. గవర్నర్లకు సమయం ఉండాలని, నిర్దేవజత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. ఇకపోతే గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియ జేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళిసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చని కూడా సూచించింది. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది.

# నగర ప్రజలను అలరించిన సాంస్కృతిక వైభవం

- మూడు రోజుల పాటు సాగిన నార్త్ ఈస్ట్ స్టేట్స్ ఫెస్ట్
- గవర్నర్, సిఎంల రాకతో మరింత శోభ



**హైదరాబాద్, నవంబర్ 22 :** తెలంగాణాకు ఈశాన్య రాష్ట్రాలకు మధ్య పటిష్టమైన సాంస్కృతిక సామీప్యత, చారిత్రకంగా, సామాజిక సామీప్యత చాలా ఉంది. ప్రధానంగా తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం లలో వైవిధ్యమైన సాంస్కృతిక ఆచారాలు, ఉత్సవాలు,నృత్య రీతులు, భాషల మధ్య అత్యంత సాన్నిహిత్యం కనిపిస్తుంది. ప్రధానంగా తెలంగాణా రాష్ట్ర సాధనకై జరిగిన సుదీర్ఘ పోరాటం తో 2014లో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైనది. అదేవిధంగా, స్వయంపాలన, సంస్కృతి పరిరక్షణ, ఆత్మగౌరవ పాలనకై ఈశాన్య రాష్ట్రాలు కూడా ఉద్యమాలు చేశాయి. ఫలితంగా నాగాలాండ్ 1963 లోనూ, మేఘాలయ 1972లో ఏర్పాటయ్యాయి. ఇక్కడి జానపదాల కళలు, చేనేతలకు మధ్య కూడా దగ్గరి సామీప్యత ఉంది. ఈశాన్య రాష్ట్రాలలో దేశంలోనే అత్యధిక గిరిజన జనాభా ఉండగా తెలంగాణలోనూ ఆదివాసీ, లంబాడీ, గోండు, యానాది తదితర గిరిజన తెగలున్నాయి. అయితే, ఈ ఇరు ప్రాంతాల మధ్య కళా, సాంస్కృతిక, చారిత్రక, క్రీడా, వ్యవసాయ సంస్కృతిక బంధం మరింత పటిష్ట అయ్యే విధంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ కు రూపకల్పన చేయడమే కాకుండా, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో అద్భుతంగా నిర్వహించారు. నవంబర్ 20 ,21 ,22 తేదీల మధ్య జరిగిన ఈ తెలంగాణ నార్త్ ఈస్ట్ ఫెస్టివల్ నభూతో, నా భవిష్యత్ మాదిరిగా జరిగింది. కర్త, కర్మ, క్రియ అన్నీ తానుగా పర్యవేక్షించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ ఫెస్టివల్ విజయానికి పరోక్ష కారకులయ్యారు. తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు పాల్గొన్న ప్రారంభ సమావేశంతో మొదలైన ఈ మూడు రోజుల కళా, సాంస్కృతిక, క్రీడా, సామాజిక ఉత్సవం 22వ తేదీన ముగిసింది. ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, లిటరేచర్, విమెన్ ఎంపవర్మెంట్, ఫిలిం ఫెస్టివల్, స్పోర్ట్స్ రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య ఉన్న బంధాన్ని తెలియచేసేవిధంగా అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా ఫైన్ ఆర్ట్స్ రంగంలో ఇరు ప్రాంతాలకు చెందిన పెయింటింగ్స్, ఫోటో ప్రదర్శనలు, ఫ్యాషన్ షోలు,సాహిత్య చర్చలు నిర్వహించారు. లిటరేచర్ లో సాహిత్య అకాడమీ గ్రహీతలైన గోరటి వెంకన్న, అలక్ నంద దాస్ గుప్త, అంపశయ్య నవీన్,అనిందయో రాయ్, గీతా రామస్వామి లాంటి ప్రముఖులు పాల్గొన్నారు. మహిళా సాధికారత, స్పోర్ట్స్, ఫిలిం ఫెస్టివల్ లను అద్భుతంగా నిర్వహించారు. ప్రధానంగా, ఐమాక్స్ లో నిర్వహిం చిన ఫిలిం ఫెస్టివల్ లో త్రిపుర, సిక్కిం, అస్సామీ, మేఘాలయ, మణిపూర్ రాష్ట్రాల ప్రముఖ సినిమాలతోపాటు తెలంగాణాకు చెందిన బలగం, పొటెల్, నా బంగారు తల్లి, మల్లేశం లాంటి సినిమాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ నటులు ప్రియదర్శి, దిల్ రాజు, తమ్మారెడ్డి భరద్వాజ, ప్రియాంక, ఈశాన్య రాష్ట్ర నటులు, దర్శకులు పాల్గొన్నారు.తెలంగాణా- ఈశాన్య రాష్ట్రాల క్రీడలపై చర్చా గోష్ఠులు, ఫుట్ బల్ ప్రదర్శన మ్యాచ్ లు అద్భుతంగా జరిగాయి. ప్రధానంగా, ఇరు ప్రాంతాలకు చెందిన సృజనాత్మకతను ప్రతిబింబించేలా నిర్వహించిన ఫ్యాషన్ షో హైలెట్‌గా నిలిచింది. నవంబర్ 22న హైటెక్స్‌లో జరిగిన ముగింపు సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లు పాల్గొనడంతో ఈ మూడు రోజుల కార్యక్రమాలు అద్భుతంగా ముగిశాయి. తిరిగి, రెండవ విడత కార్యక్రమాలు నవంబర్ 25 వ తేదీ నుండి 27 వరకు హైదరాబాద్ లో జరుగనున్నాయి.

# పుట్టపర్తి చేరుకున్న రాష్ట్రపతి

## ముర్ముకు ఘనంగా స్వాగతం పలికిన సిఎం, మంత్రులు



**పుట్టపర్తి, నవంబర్ 22 :** సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో పాల్గొనడానికి శనివారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పుట్టపర్తి ఎమ్మెల్యే లు కలిసి రాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఉన్న సత్యసాయి బాబా మహాసమాధికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేష్, తదితరులు నివాళులర్పించారు. ప్రశాంతి నిలయంలోని ఆలయంలో రాష్ట్రపతి ప్రార్థించారు. వేద పండితులు కలిసి రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ టెస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్.జె.రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# పెళ్లి కాకముందే తల్లయిన యువతి

## పుట్టిన బిడ్డను అమ్మేందుకు యత్నించి భంగపాటు

**కరీంనగర్, నవంబర్ 22 :** ఈ మధ్య కాలంలో శిశువు విక్రయాలు ఎక్కువయ్యాయి. అక్రమ సంబంధం ద్వారా పుట్టిన బిడ్డను అమ్మేసేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు మహిళలు. మరికొన్ని చోట్ల బిడ్డను పోషించే స్థోమత లేక అమ్మకానికి పెట్టేస్తున్నారు. ఇఓ మహిళ కూడా ఇలాంటి దారుణానికే పాల్పడింది. అప్పుడే పుట్టిన బిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించి చివరకు ఊచలులెక్కబెడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో యువతి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ యువతి ఓ వ్యక్తిని ప్రేమించింది. ప్రేమికుడి కారణంగా గర్భవతి అయిన యువతి.. మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ అతడు మోసం చేయడంతో బిడ్డను ఎలా పోషించాలో తెలియక దారుణ నిర్ణయిం తీసుకుంది. తనకు పుట్టిన బిడ్డను అమ్మకానికి పెట్టింది. ఏకంగా ఆరు లక్షలకు శిశువును విక్రయించేందుకు బేరం కుదిరింది. బిడ్డను విక్రయించేందుకు కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకినివాని ప్లలెకి చెందిన రాయమల్లు, లత దంపతులకు శిశువు విక్రయానికి ఒప్పందం కుదిరింది. విషయం తెలిసిన బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన కరీంనగర్ టూ టౌన్ పోలీసులు.. శిశువు విక్రయాన్ని అడ్డుకున్నారు. శిశువును అమ్మేందుకు సహకరించిన 15 మందిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సైబర్ నేరాలపై అవగాహన

- సైబర్ నేరగాళ్ల బెదిరంపులకు లొంగవద్దు
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్, నవంబర్ 22 :** సైబర్ నేరాలను అడ్డుకునేందుకు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు కాల్ చేసి బెదిరిస్తే భయపడ వద్దన్నారు. భయపడితే అది సైబర్ నేరస్తుల బలం అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ ఫోటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయవద్దని.. అలా చేస్తే మిమ్మల్ని ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ సింబా పేరిట వాలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.



# యాంటీబయోటిక్స్ వాడవద్దు

## వైద్యులు సూచిస్తేనే వాడాలి

**ఆదిలాబాద్, నవంబర్ 22 :** అతిగా యాంటీ బయోటిక్స్ వాడితే ప్రమాదమని వైద్యులు హెచ్చరించారు. తమకు తెలిసిన మందులను వైద్యుల సలహా లేకుండా వాడరాదన్నారు. ఇది ఇతర వ్యాధులకు దారితీస్తుందని అన్నారు. 'ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారం' ను పురస్కరించుకొని శనివారం రిమ్స్ మైక్రోబయాలజీ విభాగం, వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ.. రిమ్స్ నుంచి కలెక్టరేట్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ మాట్లాడుతూ.. యాంటీబయోటిక్స్ వాడకం వల్ల ఏర్పడే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామ న్నారు. అధికంగా యాంటీ బయోటిక్స్ వినియోగంతో ప్రజల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. వైద్యుల సూచనల మేరకు వాటిని వినియోగించాలన్నారు. అయితే ఇది తెలియక ఎవరికి వారుత తమకు తోచిన మందులను వాడేస్తున్నారని అన్నారు. ఇది ప్రమాదమో తెలుసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ దీపక్ పుష్కర్, ఎన్‌సీడీ కార్యక్రమాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టను సందర్శించిన మంత్రి పార్థసారథి

**యాదగిరిగుట్ట, నవంబర్ 22 :** యాదాద్రిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ఇదో అదృష్టమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె. పార్థసారథి అన్నారు. ఇక్కడికి రావడం నిజంగానే అదృష్టమన్నారు. దేవాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకు న్నారు. ఆలయ అధికారులు, పూజారులు సంప్రదాయబద్ధంగా మంత్రి కుటుంబానికి స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభూ పంచనారసింహులను మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తా

## స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ, నవంబర్ 22 :** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈ నెల 23వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చినట్లు స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ నోటీసులపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తానని వెల్లడించారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. కడియం శ్రీహరి భయపడడు. ఉప ఎన్నికలు వచ్చిన పక్షంలో కచ్చితంగా మళ్లీ పోటీ చేస్తా. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకు ఉందని కడియం అన్నారు. ఇందులో రాజకీయం లేదన్నారు.

# ఢిల్లీ పేలుళ్ల కేసులో ముమ్మర దర్యాప్తు

## శ్రీనగర్‌లో మరొకరి అరెస్ట్

**శ్రీనగర్, నవంబర్ 22 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటనలో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీనగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారం అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని నియాజ్ భట్‌గా గుర్తించారు. గత అక్టోబర్ లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. శ్రీనగర్ సీనియర్ ఎస్పీ డాక్టర్ జీవీ సుందీప్ చక్రవర్తి ఈ విచారణను పర్యవేక్షించి, సీసీటీవీ అనాలసిస్ చేపట్టడంతో మొదటి ముగ్గురి అనుమానితులు పట్టుబడ్డారు. ఆరిఫ్ నసీర్ దర్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రాఫ్, మక్సూద్ అహ్మద్ దర్ అలియా షాహిద్‌లను అరెస్టు చేశారు. వీరిని విచారించిన దర్యాప్తు సంస్థలు ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు. అతను గతంలో పారామెడిక్‌గా పనిచేసి ఇమామ్‌గా మారాడని, పోస్టర్లు సరఫరా చేయడంతో పాటు డాక్టర్లను రాడికల్స్‌గా మార్చినట్టు గుర్తించారు. క్రమంలోనే ఫరీదాబాద్‌లోని అల్ ఫయిదా యూనివర్శిటీలో సోదాలు నిర్వహించారు. డాక్టర్ ముజఫర్ గనాయే, డాక్టర్ షహీన్ సయీద్‌లను అరెస్టు చేసి 2,900 కిలోల పేలుడు పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ గనాయ్, కారు పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబి, ముజఫర్ రాథెర్‌లతో కూడిన కోర్ గ్రూప్ ఈ పేలుడు కుట్రకు ప్రధాన కారణమని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ముజఫర్ రాథెర్ పరారీలో ఉన్నాడు.

# ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అర్బన్ ఫామింగ్ ట్రైనింగ్

**హైదరాబాద్, నవంబర్ 22 :** తెలంగాణ ఉద్యానశిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో అర్బన్ ఫామింగ్ పథకం కింద హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలలో ఇంటి ఆవాసాలు, బాల్కానీలపై కూరగాయాల పెంపకంపై ఈనెల 23న శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగుతుందని, ఆసక్తి గలవారు ఫీజు రూ.100 చెల్లించి నేరుగా హాజరు కావా లని కోరారు. మరిన్ని వివరాలకు అర్బన్ ఫామింగ్ విభాగము, నాంపల్లి, హైదరాబాద్ లేదా 8977714411/ 8688848714ను సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

# బిసి ఉద్యమానికి శత్రువు ఎవరు?



**కామారెడ్డి,రాజముద్ర న్యూస్:** ఏ నినాధం వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోలేనంత వరకు ప్రజలు మోసపోతునే ఉంటారని కామ్రేడ్ లెనిన్ అంటారు. నేడు జరుగుతున్న బిసి ఉద్యమానికి ఎవరు విదానపరమైన వర్గ శత్రువు ఎవరో గుర్తించనంత కాలం ఉద్యమ నేపథ్యం అనుకున్న లక్ష్యం చేరదు. గొంగడిలో కూర్చుని అన్నం తిన్న చందంగా ఉద్యమ నేపథ్యం పల్చన కావోద్దు. బిసిల న్యాయమైన హక్కుల సాధన స్వతంత్ర బావజాల పునాదులపైన నిర్మాణం జరగాలి. రాజకీయ పార్టీల కనుసన్నల్లో ఉద్యమం ఉంటే గొర్రెల మందలో తొడేల్లు దూరినట్టే ఉంటుంది. బిసి ఉద్యమంలో ఐడెంటిటి క్రైస్సెస్ ఎక్కువ ఉంటుంది. బిసి సమాజ ప్రయోజనాల కన్న వ్యక్తి పూజ చుట్టే ఉద్యమం తిరగడం, ఉద్యమ లక్ష్యం నిర్ణయాలు సొంతంగా తీసుకోవడం రాజకీయ పార్టీల నియంత్రణ వల్ల ఉద్యమ కార్యాచరణ వెనక్కి తగ్గడం జరుగుతున్న సందర్భాలు అనేకం చూసాము. గ్రౌండ్ నిర్మాణంలో బావజాల వ్యాప్తి ఎంతో కొంత ఉన్న ఉద్యమ నిర్మాణం అవసరం ఉంది. ఆచరణ లేని సిద్దాంతం గుడ్డింది అన్నట్టు ఉద్యమానికి ఆయువు పట్టు నిర్మాణం దీనిపైన అన్నీ బిసి కుల సంఘాలు దృష్టి పెట్టాలి.

### బిసిల సాంస్కృతిక పోరాటం అత్యవసరం

బిసి ఉద్యమానికి బలమైన సాంస్కృతిక సాహిత్య పునాది పటిష్టమైన విభాగం ఉండాలి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దళిత ఉద్యమంలో విపరీతమ్మైన సాహిత్యం వచ్చింది. కళ రూపాలు వచ్చినవి. వేలాది మంది కళాకారులు తెలంగాణ ఉద్యమంలో కాలుకు గజ్జే కట్టి ఊరువాడ తిరిగి ఉద్యమ వ్యాప్తికి కృషి చేసారు. బిసి ఉద్యమం ఆ విధంగా సాంస్కృతిక సాహిత్య పరంగా బలపడాలి. పుస్తకాలు పాటలు సీనిమాలు కళ రూఫాలు. వృత్తుల సంస్కృతి విరివిగా బయటికి రావాలి. ఉదాహరణకు 42% రిజర్వేషన్ల ఉద్యమానికి కేవలం ఒక్క రాజకీయ పార్టీలే శత్రువులు కావు న్యాయ పరమైన, రాజ్యాంగ పరమైన అంశాలు అడ్డుకట్టగా ఉన్నాయి దీనిపైన సమంతరమైన పోరాటం జరగాలి. బిసిల బలమైన ఉద్యమానికి బిసిలే నాయకత్వం వహించాలి. కడుపు నొప్పి ఉన్నావాడే మాత్రాలు వేసుకోవాలి. అప్పుడే నొప్పి తగ్గుతుంది. ఉద్యమానికి ప్రజాస్వామ్యమిక వాదులు మద్దతు ఇస్తే వారిది కేవలం మంత్రాసాని తనమే అయి ఉండాలి. బిసి ఉద్యమం పైన కర్ర పెత్తనం ఉండ కూడదు. బిసి ఉద్యమానికి బిసిలు ఇన్ సైడర్ లు బిసియేతరలు ఎవరైన అవుట్ సైడర్ లే ఈ సోయితో బిసి ఉద్యమం ముందుకు సాగాలి. అమ్మకానికి ఉద్యమం అన్న నాయకత్వం పట్ల అప్రమత్తత అవసరం. రాజకీయ పార్టీల మద్దతు అవతలి నుండే తీసుకోవాలి. గడప అవతలే చుట్టం అన్న విధంగా ఉండాలి. బిసి ఉద్యమానికి రాజకీయ స్థబ్దత ఉంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వేలాది వేదికలు ఉన్న టి ఆర్ యస్ అనే ఒక రాజకీయ పార్టీ కెసిఆర్ నాయకత్వంలో ఉంది. ఎన్ని ఉద్యమాలు చేసిన పంట కోత కిచ్చిన తర్వాత రాజకీయ పార్టీగా ఉన్న టి ఆర్ యస్ కుప్పగా మలుచుకుంది. రేపటి రోజున బిసి ఉద్యమం బలబడి ఓ ఉద్యమ శక్తిగా బలపడితే రాజకీయ పార్టీ లేకపోతే ఏదో ఒక రాజకీయ పార్టీకి బిసి ఉద్యమం కొమ్ము కాసే పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీ నిర్మాణం పైన దృష్టి అవసరం. ఉద్యమ నిర్మాణంతో పాటు ఉద్యమ బావజాల ఐక్యత అవసరం. బిసి సంఘాల మధ్య కుల సంఘాల మద్య ఓ గొలుసు కట్టు మానవీయ పునర్ నిర్మాణం బందం బలపడాలి. బిసిల్లో వెనుకబడిన యంబిసిలు బిసి సంచార కులాల పట్ల ఎదిగి ఉన్న బిసి కులాల వారు వారి రాజకీయ ప్రాతినిధ్యం, ప్రయోజనాల కోసం చేయుత ఇవ్వాల్సిన అవసరం ఉంది. బిసిల ఏబిసిడి వర్గీకరణ ద్వారా ఎవరేంతో వారి వాట దక్కేలా సహపంక్తి బోజనంలా సమంతరమైన న్యాయం అందరికి జరగాలి. బిసి ఉద్యమం రాజకీయ నినాదమే కాకుండ ఆర్థిక నినాదం సామాజిక నినాదం ఎత్తుకోవాలి. సంపద లో సామాజిక న్యాయంలో విద్య ఉద్యోగంలో మనమేంతో మనకంత వాట దక్కాలి. అదే బిసిల న్యాయమైన అస్తిత్వం.

**- అంబాల నారాయణ గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్**



## లబ్ధిదారులకు ఎలక్ట్రిక్ వాహనాలు పంపిణీ

**కామారెడ్డి కలెక్టరేట్, రాజ ముద్ర :** స్త్రీనిధి ద్వారా ఋణ సహాయం ద్వారా మంజూరైన ఎలక్ట్రిక్ ఆటోలు, బైకులు లబ్ధిదారులకు అందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఆవరణలో స్త్రీ నిధి ద్వారా ఋణ సహాయం కింద ఎలక్ట్రికల్ ఆటోలు, బైకులను జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ....స్త్రీనిధి తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహంతో కొనసాగుతున్న అత్యున్నత సహకార క్రెడిట్ సొసైటీ, జిల్లాలోని మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలను అందిస్తూ, పేదరిక నిర్మూలనలో ముఖ్యపాత్ర పోసిస్తోందన్నారు. సహకార సంఘాల కింద నమోదైన స్త్రీనిధి, బ్యాంకింగ్ రంగంలోని క్రెడిట్ ను సమర్థంగా భర్తీ చేస్తూ, మహిళల జీవనోపాధి అభివృద్ధికి వివిధ ఆదాయ కార్యక్రమాలకు ఆర్థిక మద్దతు అందిస్తోందన్నారు . ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని కామారెడ్డి, లింగంపేట్, రాజంపేట, దోమకొండ, బిక్నూర్ మండలాలకు చెందిన మొత్తం 11 మంది లబ్ధిదారులకు 15 లక్షల రూపాయల స్త్రీనిధి బ్యాంకు ఆర్థిక సహకారంతో 2 ఎలక్ట్రిక్ ఆటోలు, 9 ఎలక్ట్రిక్ బైకులు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన సాధనలో స్త్రీ నిధి బ్యాంకు అందిస్తున్న ఈ సహాయం కీలక పాత్ర పోషిస్తోందని ఈ వాహనాల పంపిణీ తో గ్రామీణమహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, వారిలో ఆర్థిక స్థిరత్వం సాధనకు మరింత ప్రోత్సాహం లభించనుందన్నారు.



## మంత్రి ఉత్తంకుమార్ రెడ్డినీ కలిసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**బాన్సువాడ, రాజముద్ర న్యూస్ :** హైదరాబాద్ లోని జల సౌధలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో భేటీ అయిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి. బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోరా మరియు చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించి ఈరోజు జలసౌధలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి గారితో సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోరా మరియు చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ పనుల గురించి చర్చించారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపం లేకుండా చూడాలని సూచించారు.

# మానసిక వికలాంగులకు చైల్డ్ గైడెన్స్ సెంటర్ గొప్ప వరం

### చైల్డ్ గైడెన్స్ సెంటర్ నిరుపేద మానసిక వికలాంగ బాలలకు మార్గదర్శక దీపం

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి మండలం, పీర్జాదిగూడ కార్పొరేషన్, 16వ డివిజన్ గణేష్‌నగర్ మానసిక వికలాంగతతో బాధపడే నిరుపేద పిల్లలకు విద్య, సంరక్షణ, వ్యక్తిత్వ వికాసం అందించాలనే మహత్తర లక్ష్యంతో 1973 ఆగస్టు 6న ప్రారంభమైన చైల్డ్ గైడెన్స్ సెంటర్ (సిజిసి) నేడు వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తోంది. ఈ సంస్థను ఫౌండర్ ప్రెసిడెంట్ లలిత మోల్కేటి ఇద్దరు పిల్లలతో చిన్న స్థాయిలో ప్రారంభించారు. ఆరంభ సంవత్సరం నుంచే తన సేవాభావంతో, నిస్వార్థ కృషితో సంస్థను ఎదగదీసిన లలిత మోల్కేటి, 2000 సంవత్సరం వరకు 50 మంది మానసిక వికలాంగ పిల్లలకు విద్యాబోధన, సంరక్షణ అందిస్తూ సిజిసి ట్రస్ట్ రూపంలో సేవలు కొనసాగించారు. 2000 సంవత్సరంలో ఆమె నాటిన సేవావిత్తనాన్ని కొనసాగిస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను డాక్టర్ ఫ్రాంక్ విశ్వనాథ్ స్వీకరించారు. అప్పటి నుంచి ఫౌండర్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, నిరంతరం సేవా దృక్పథంతో సీజీసీని అభివృద్ధి దిశగా నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రారంభంలో 50 మంది పిల్లలతో సాగిన ఈ సేవా ప్రస్థానం, నేడు 2025 నాటికి 170 మంది విద్యార్థులు చదువుకునే స్థాయికి చేరింది. మానసిక వికలాంగ పిల్లల విద్య, ప్రత్యేక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో చైల్డ్ గైడెన్స్ సెంటర్ విశేష ఫలితాలు సాధించింది. ఎంతోమంది కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపుతూ, పిల్లల్లో స్వయం ఆధారిత నైపుణ్యాలు పెంపొందిస్తోంది. సంస్థ పరిపాలనను బలోపేతం చేస్తూ డి. రజని ప్రిన్సిపాల్‌గా, ఎం. జైనీ రోస్ కుమారి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారి నాయకత్వంలో సీజీసీ అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తూ సమాజంలో మంచి పేరు సంపాదిస్తోంది. అనాథ, నిరుపేద, మానసిక వికలాంగ పిల్లలకు ప్రేమతో, సేవాభావంతో, కుటుంబసభ్యుల మాదిరిగా చూసుకుంటూ 50 ఏళ్లకు పైగా నిరంతర సేవలందిస్తున్న ఈ సంస్థ పీర్జాదిగూడ ప్రాంతంలో ఒక గొప్ప సేవా ప్రబోధ సంస్థగా నిలుస్తోంది.








## లాటరీ ద్వారా వార్డుల మహిళ రిజర్వేషన్ ఎంపిక

- అఖిలపక్షం సమక్షంలో పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ
- పంచాయితి రిజర్వేషన్లతో పాటుగా వార్డుల ప్రకటన
- ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఆశావహ అభ్యర్థులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల కమిషన్ సైతం మూడు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. దీంతో గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీచేయాలని భావిస్తున్న ఆశవాహుల్లో ఉత్కంఠ రేకెత్తిస్తుంది. గ్రామ పంచాయితీల రిజర్వేషన్ తమకు అనుకూలంగా ఉంటుందో, ప్రతికూలంగా ఉంటుందోనన్న సందిగ్ధం పోటీ దారుల్లో నెలకొంది. ఒక వేళ రిజర్వేషన్ కలిసి రాకపోతే త్వరలో జరిగే జడ్పీటీసీ, ఎంపిటీసీ లకు పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### వార్డు సభ్యుల రిజర్వేషన్ లాటరీ పద్ధతిలో ఎంపిక..!

పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో శనివారం లాటరీ పద్ధతిలో పంచాయితీ వార్డుల మహిళ రిజర్వేషన్ ఎంపిక పై అఖిల పక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. లాటరీ విధానం, రిజర్వేషన్ల కేటాయింపు పై ఆయా పార్టీల నాయకులకు ముందుగా అవగాహన అవగాహన కల్పించారు. అనంతరం నాలుగు మండలాలకి సంబంధించి పంచాయితి వార్డుల్లో మహిళ రిజర్వేషన్ ఎంపిక కోసం చీటిలు రాసి డబ్బాలో వేసి వాటన్నింటినీ కలిపిన అనంతరం ఒక్కో చీటిని అఖిల పక్ష నాయకుల సమక్షంలో లాటరీ తీసి బహిరంగంగా రిజర్వేషన్ లను ప్రకటించారు. ఉన్నతాధికారులు జారీ చేసిన జీఓ ప్రకారమే వార్డుల మహిళ రిజర్వేషన్ ప్రక్రియ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కి ఈ వార్డుల రిజర్వేషన్ వివరాల నివేదిక అందిస్తామని తెలిపారు. తదుపరి జిల్లా కలెక్టర్ వాటిని పరిశీలించి గ్రామ పంచాయితీ రిజర్వేషన్లతో పాటుగా వార్డు సభ్యులు రిజర్వేషన్లు కూడా గెజిట్ ద్వారా ప్రకటిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు సిలార్ సాహెబ్, ఎర్రయ్య, జశ్వంత్ కుమార్, ఎంపీఓలు రామచందర్ రావు, ప్రభాకర్ రెడ్డి, శివ, సూపరింటెండెంట్ శారద, సీనియర్ అసిస్టెంట్ మీరా, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ, బిఎస్పీ, న్యూ డెమోక్రసీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.








## ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరాలి

### సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుంది, దీనిలో భాగంగా రాత్రింబవళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ పటిష్టంగా తనిఖీలు నిర్వహిస్తుంది, రోడ్డు ప్రమాద స్థలాలను పరిశీలిస్తూ నివారణ చర్యలు తీసుకోవడం, గ్రామీణ రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు చేయడం లాంటి చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తో కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 65 కొత్త వ్యవసాయ మార్కెట్ రోడ్ జంక్షన్ ను పరిశీలించారు. వాహనాల యొక్క వేగం, ప్రజల రాకపోకలు, రోడ్డు క్రాసింగ్, ఇంజనీరింగ్ లోపాలు, లైటింగ్ ఏర్పాట్లు, బారికేడ్ ల ఏర్పాటు మొదలగు అంశాలను పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పోలీస్ నిరంతరం ప్రజల రక్షణలో కృషి చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 43 రోడ్డు ప్రమాద నివారణ కమిటీలను ఏర్పాటు చేశామని, రోడ్డు భద్రత పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రయాణ సమయంలో ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష, ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ బీర్కూర్ వారి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో షుగర్ వ్యాధి వచ్చిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సీతాలు రమేష్ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు, ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, పేదవారిని గుర్తించి ఆర్థిక సహాయం, వాళ్లకు కావాల్సిన సామాగ్రిని లయన్స్ క్లబ్ తరఫున అందజేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా పేదవారు ఉంటే మా లయన్స్ క్లబ్ ను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కబ్ సభ్యులు మేకల విట్టల్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## 35 క్వింటళ్ళ పిడిఎస్ బియ్యం పట్టివేత

**బాన్సువాడ, రాజముద్ర న్యూస్ :** బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుడిమి చౌరస్తా వద్ద పక్క సమాచారం తో 35 క్వింటళ్ళ పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న బొలెరో వాహనం పై దాడి చేసి బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాన్సువాడ నుంచి 17 0993 నెంబర్ గలబోలోరే వాహనం లో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పక్క సమాచారంతో వాహనంపై దాడి చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. డ్రైవర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ టౌన్ సిఐ అశోక్ తెలిపారు. ఎవరైనా అక్రమ బియ్యం తరలిస్తే బాన్సువాడ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.



## సంస్కరణల పేరుతో 29 కార్మిక చట్టాల్ని రద్దు చేసిన నరేంద్ర మోడీ సర్కార్

### సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని బాలానగర్ చౌరస్తా లో 4 లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని 4కోడ్ ల పత్రాలను భగ్నం చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ దేశ కార్మిక వర్గం సుదీర్ఘకాలం అనేక త్యాగాలు, ఆందోళనలు, పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు కాలగర్భంలో కలిసి పోయాయని, గత ఐదేండ్లుగా ఈ చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వం అప్పటి నుంచి కార్మికుల ఆగ్రహజ్వాలలకు భయపడుతూ వెనకడుగు వేస్తూ వచ్చిందన్నారు. బీహార్‌లో ఎన్డీఏ కూటమికి అత్యధిక మెజారిటీ రావడంతో కేంద్రంలో కార్పొరేట్ అనుకూల విధానాల అమలు వేగవంతమైందని, దానిలో భాగంగానే 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని, ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులు సమ్మె హక్కుతో పాటు అనేక ప్రయోజనాలను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, శ్రీనివాస్, వినోద్, లక్ష్మి, వనిత, శ్రీదేవి పాల్గొన్నారు.






## జిల్లాలో మొదలైన టీఎన్జీవో సభ్యత్వ నమోదు

### ముఖ్యఅతిథిగా హాజరైన నాగేందర్ రెడ్డి

**కామారెడ్డి,రాజముద్ర న్యూస్:** జగిత్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో టిఎన్జీవోస్ సంగం సభ్యత్వ కార్యక్రమం ఘనంగా మొదలైంది. జిల్లాలో జరిగినటువంటి ఈ టీఎన్జీవోస్ మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన టిఈజేఏసీ చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్ ను కలిసి శాఖలోని వివిధ సమస్యల పరిష్కారం కొరకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించడం జరిగిందనీ ప్రెసిడెంట్ విఠల్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, సెక్రటరీ గంగరాజు జె. వి. వో., కోశాధికారి వెంకట్ ఎల్.ఎస్.ఎ, మిగతా కార్యవర్గ సభ్యులు రంగు శ్రీనివాస గౌడ్ ఎల్.ఎస్.ఎ లు తెలిపారు.

# పేలుళ్లకు ప్లాన్ చేశాం!

- బాంబు పేలుడు అనుమానితుడు వెల్లడి
- విచారణలో అంగీకరించినట్లుజాతీయ మీడియా కథనాలు



**దిల్లీ పేలుడు ఘటనలో ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సమయంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జైషే ఉగ్రసంస్థతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు కుట్ర పన్నడం నిజమేనని సమాచారం. 2023లో ఈ ప్రణాళిక వేసినట్లు బాంబు పేలుడు అనుమానితుడు విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.**

**న్యూఢిల్లీ :** దిల్లీ పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్‌ను ఉమర్ నబీగా గుర్తించిన సంగతి తెలిసిందే. అతడితో సంబంధాలున్న పలువురు అనుమానితులను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్త దాడుల కోసం రెండు సంవత్సరాలుగా సిద్ధం అవుతున్నానని, పేలుడు పదార్థాలు, రిమోట్లు, బాంబు తయారీ పదార్థాలను సేకరిస్తున్నానని అనుమానితుల్లో ఒకడైన డా. ముజమ్మిల్ షకీల్ జాతీయ దర్యాప్తు సంస్థ విచారణలో అంగీకరించినట్లు సమాచారం. యూరియా, అమ్మోనియా నైట్రేట్‌ను కొనుగోలు చేయడం తనకు అప్పగించిన పనని చెప్పినట్లు తెలుస్తోంది. "హరియాణాలోని గురుగ్రామ్, నూహ్ నుంచి రూ.3లక్షల పెట్టి, 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను ముజమ్మిల్ కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాద్‌లోని రెండు వేర్వేరు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఈ రసాయనాలను నిల్వ చేసేందుకు ఒక డీప్ ఫ్రీజర్‌ను అమర్చుకున్నాడు. ఈ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్థాల్లో వాడేలా ప్రాసెస్ చేయడం, ఇతర రసాయనాలను సమకూర్చడం బాంబర్ ఉమర్ పని" అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. దిల్లీ పేలుళ్ల కుట్రకు ఉగ్ర అనుమానితులే నిధులు సమకూర్చారని, పేలుడు పదార్థాల కొనుగోలుకు రూ.26 లక్షలు సేకరించారని సదరు వర్గాలు వెల్లడించాయి. ఆ మొత్తాన్ని బాంబర్ ఉమర్‌కు ఇచ్చారని.. అతడు కూడా స్వయంగా రూ.2లక్షలు ఇచ్చాడని పేర్కొన్నాయి. ఇక, అల్-ఫలా విశ్వవిద్యాలయంలో డబ్బు విషయంలో ఉమర్, ముజమ్మిల్ మధ్య గొడవ జరిగిందట. దానితర్వాత తన రెడ్ ఎకోస్పోర్ట్ కారును ముజమ్మిల్‌కు ఉమర్ ఇచ్చాడని తెలిపాయి. దర్యాప్తులో భాగంగా ఆ కారును ఫరీదాబాద్‌లో గుర్తించిన సంగతి తెలిసిందే. తాను రూ.6.5 లక్షలు పెట్టి ఏకే-47 రైఫిల్ కొన్నట్లు కూడా ముజమ్మిల్ అంగీకరించాడు. దానిని కశ్మీర్‌కు చెందిన మరో డాక్టర్ అదీల్ రాథర్ లాకర్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. తన హ్యాండ్లర్ పేరు మన్సూర్ అని, ఉమర్ హ్యాండ్లర్ పేరు హాషీమ్ అని.. ఆ ఇద్దరు హ్యాండ్లర్లు ఇబ్రహీం అనే వ్యక్తి ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తారని ఉగ్ర డాక్టర్ అంగీకరించినట్లు సమాచారం. ముజమ్మిల్, అదీల్, ముజఫర్.. ఉకాసా ఆదేశాల మేరకు తుర్కియేలో పర్యటించారు. ఉకాసాకు తెహ్రీకీ తాలిబన్ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయి. ముజమ్మిల్, ఉకాసా.. టెలిగ్రామ్ ద్వారా సంభాషించుకునేవారు. అయితే ఉకాసా హ్యాండ్లర్ గురించి ముజమ్మిల్ అడగ్గానే.. వారి సంబంధం తెగిపోయిందని సమాచారం. కాగా.. విచారణలో భాగంగా వెల్లడవుతోన్న విషయాలన్నీ దేశవ్యాప్తంగా పేలుళ్లకు కుట్రను తెలియజేస్తున్నాయని దర్యాప్తు అధికారులు విశ్వసిస్తున్నట్లు సమాచారం.

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సొనారో అరెస్టు



**బ్రెజిల్ :** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో అరెస్టయ్యారు. తిరుగుబాటు కుట్ర చేశారన్న అభియోగాలపై ఇప్పటికే ఆయనకు 27 సంవత్సరాలు శిక్ష పడగా.. మరికొన్ని రోజుల్లోనే జైలుకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ముందస్తుగా ఆయన్ను ఫెడరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఉదయం అరెస్టు చేశా రని, రాజధాని బ్రెసిలియాలోని పోలీసు కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు బోల్సొనారో ప్రతినిధి వెల్లడించారు. మరోవైపు ఇదే అంశంపై ఫెడరల్ పోలీసు లు స్పందిస్తూ.. సుప్రీం కోర్టు ఆదేశా లకు అనుగుణంగా చర్యలు తీసుకున్నా మని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 నుంచి 2022 వరకు బ్రెజిల్ అధ్యక్షుడిగా ఉన్న బోల్సొనారో.. 2022 ఎన్నికల్లో ఓడిపోయారు. అయినప్పటికీ ఫలితాలను అంగీకరించేందుకు నిరాకరించారు. ఆ సమయంలో వేల సంఖ్యలో ఆయన మద్దతుదారులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పదవిలో కొనసాగేలా తిరుగుబాటు కుట్రకు బోల్సొనారో ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు.. మాజీ అధ్యక్షుడికి 27 ఏళ్ల శిక్ష విధిస్తూ ఈ సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో కేసు విచారణ సమయం నుంచే (ఆగస్టు) బోల్సొనారో గృహ నిర్బంధంలో ఉన్నారు. న్యాయస్థానం విధించిన శిక్షపై అప్పీలుకు వెళ్లగా అక్కడ చుక్కెదురయ్యింది. జైలుకెళ్తే తీవ్ర ఇబ్బందులు ఉంటాయని, ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని మాజీ అధ్యక్షుడి తరఫు న్యాయవాదులు వాదించారు. ఆయన ఆరోగ్యం క్షీణించిందని, గృహనిర్బంధంలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఉపశమనం లభించలేదు.

## నైజీరియాలో 300 మంది విద్యార్థుల కిడ్నాప్



**నైజీరియా :** ఆఫ్రికా దేశం నైజీరియాలో సాయుధ దుండగులు బడి పిల్లల అపహరణకు తెగబడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కిడ్నాప్ అయిన విద్యార్థుల సంఖ్య 300 దాటినట్లు 'క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ నైజీరియా' వెల్లడించింది. 12 మంది ఉపాధ్యాయులనూ సాయుధులు అపహరించిట్లు తెలిపింది. కెబ్బీ రాష్ట్రంలో 25 మంది పాఠశాల విద్యార్థినుల్ని కిడ్నాప్ చేసి వారం రోజులు గడవక ముందే ఈ ఘటన జరిగింది. నైజర్ రాష్ట్రంలోని సెయింట్ మేరీస్ కేథలిక్ గురుకుల పాఠశాలపై గుర్తుతెలియని సాయుధులు శుక్రవారం తెల్లవారుజామున దాడిచేశారు. తొలుత 52, ఆ తర్వాత 215 మంది వరకు విద్యార్థులు అపహరణకు గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే, స్కూల్‌లో తనిఖీలు, విద్యార్థుల లెక్కింపు అనంతరం ఈ సంఖ్య 303కు పెరిగినట్లు సీఏఎన్ ప్రతినిధి తెలిపారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్లు ఇంకా ఏ సంస్థ ప్రకటించలేదు. పిల్లలను రక్షించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ఈ ప్రాంతంలోని పాఠశాలలను భద్రత కారణాల దృష్ట్యా తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. స్కూల్‌ను తెరిచారని ప్రభుత్వం చేసిన వాదనలను సీఏఎన్ కొట్టిపారేసింది. నైజీరియాలో క్రైస్తవులకు వ్యతిరేకంగా సాగుతున్న మారణహోమాన్ని నిలిపేందుకు సైనిక చర్యకూ వెనకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఈ ఘటనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలోనూ ఆయా ఘటనల్లో వందలాది మంది పిల్లలు అపహరణకు గురయ్యారు.



### ఢిల్లీలో ప్రమాదకరంగా గాలి నాణ్యత

## ఆంక్షలు కఠినతరం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం సమస్య తీవ్రమైంది. శీతాకాలం కావడంతో పరిస్థితి మరింత దిగజారింది. కాలుష్య కారక సూక్ష్మ ధూళికణాల స్థాయిలు పెరుగుతున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విశ్లేషణలో తేలింది. దీంతో దిల్లీ అంతటా కాలుష్య నియంత్రణ చర్యలను మరింత కఠినతరం చేస్తున్నట్లు వాయునాణ్యత నిర్వహణ కమిషన్ ప్రకటించింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ప్రమాదకర స్థాయుల్లో క్షీణిస్తుండడంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌ని అమల్లోకి తెస్తున్నట్లు తెలిపింది. ఇందులో ఏముంటాయంటే?

- కాలుష్యం అధికంగా ఉన్న దిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్ వంటి ప్రాంతాలను గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) తక్కువగా ఉన్న నగరాలుగా గుర్తించడం
- వాయు కాలుష్య కారకాలను తగ్గించడం, కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం
- కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల పని వేళల తగ్గింపు
- కార్యాలయాల్లో 50శాతం సిబ్బందికి వర్క్ ఫ్రం హోం సదుపాయాన్ని( ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు) కల్పించడం
- అనవసర నిర్మాణాలు, కూల్చివేత కార్యకలాపాలపై పూర్తి నిషేధం
- దిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, నోయిడా మొదలైన ప్రాంతాల్లో ముఖ్యమైన వస్తువులను రవాణా చేసే వాహనాలు మినహా దిల్లీ బయట నమోదు చేసుకున్న అన్ని పెట్రోల్, డీజిల్ వాహనాలపై నిషేధం
- 5వ తరగతిలోపు ఉన్న అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల మూసివేత
- రైల్వే, మెట్రో, విమానాశ్రయాలు, రక్షణ రంగాలకు సంబంధించిన నిర్మాణాలు మినహా ఇతర నిర్మాణాలపై నిషేధం
- దిల్లీలోని అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300 నుంచి 400లు దాటడంతో విషవాయువుల ప్రభావం అక్కడి ప్రజలపై ఇప్పటికే మొదలైనట్లు తెలుస్తోంది. నగర ప్రజలు గొంతు, తలనొప్పి, కళ్ల మంటలు, నిద్ర సరిగ్గా పట్టకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించడానికి దిల్లీ ప్రభుత్వం కృత్రిమ వర్షాలు కురిపించడానికి ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో వాయు కాలుష్యం మరింత పెరగకుండా నిరోధించేందుకు వాయునాణ్యత నిర్వహణ కమిషన్.. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో చర్యలు చేపట్టింది.

## జీ-20 సమ్మిట్‌లో.. 'మెలోడీ' మూమెంట్



**జొహన్నెస్‌బర్గ్ :** భారత్, ఇటలీ ప్రధానులు నరేంద్రమోదీ, జార్జియా మెలోనీ మంచి స్నేహితులు . అంతర్జాతీయ వేదికలపై వారిద్దరూ కలుసుకొన్నప్పుడు ఒకరినొకరు ఆత్మీ యంగా పలకరించుకుంటుంటారు. ఆయా సందర్భాలకు సంబంధించిన దృశ్యాలు 'మెలోడీ' పేరుతో నెట్టింట తెగ వైరల్ అవుతుంటాయి. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో శనివారం జరిగిన జీ20 దేశాల 20వ శిఖరాగ్ర సదస్సు కు ప్రపంచ దేశాల అధినేతలు హాజరయ్యారు. సమావేశంలో పాల్గొనడా నికి ముందు మోదీ, మెలోని ఎదురుపడడంతో వారు చిరనవ్వులు చిందిస్తూ.. ఆత్మీయంగా పలకరించుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 2023 డిసెంబరులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వేదికగా జరిగిన 'కాప్28' సదస్సు సందర్భంగా మొదటిసారి మోదీ, మెలోనీ సెల్ఫీ వైరల్ అయిన సంగతి తెలిసిందే. మోదీతో తీసుకున్న స్వీయ చిత్రాన్ని మెలోనీ ఎక్స్‌లో షేర్ చేశారు. దానికి మెలోడీ (ఇద్దరి పేర్లలోని అక్షరాలు కలిసేలా) అనే హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. అప్పటి నుంచి ఈ పదం ట్రెండ్ అయ్యింది. గతేడాది ఇటలీలో జరిగిన సదస్సులోనూ మెలోని మోదీతో తీసుకున్న సెల్ఫీని షేర్ చేశారు. సదస్సుకు ముందు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా చేతులు జోడించి మోదీకి నమస్కరిస్తూ.. స్వాగతం పలికారు. జీ7 సదస్సు లో భాగంగా ప్రధాని మోదీ వరుస ద్వైపాక్షిక భేటీలతో బిజీబిజీగా గడిపారు. చైనా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా సహా పలు దేశాల అధినేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. మోదీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, అణు ఇంధనం సహా పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

## హిందువులు లేకుండా.. ప్రపంచం లేదు

### మోహన్ భాగవత్



**న్యూఢిల్లీ :** హిందువులు లేకుంటే ప్రపంచం ఉండదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ అన్నారు. జాతుల మధ్య ఘర్షణలు చెలరేగిన తర్వాత ఆరెస్సెస్ చీఫ్ తొలిసారి మణిపుర్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన ఓ సభలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందన్నారు. భారతదేశ నాగరికత ఎప్పటికీ అలాగే ఉంటుందన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే.. ప్రపంచానికే ఉనికి ఉండదని వ్యాఖ్యానించారు. అమెరికా సుంకాల విధింపు నేపథ్యంలో ప్రధాని మోదీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఆరెస్సెస్ చీఫ్ కూడా ఆర్థిక స్వావలంబనపై మాట్లాడారు. దేశ నిర్మాణానికి బలం చాలా అవసరమన్నారు. బలం అంటే ఆర్థిక సామర్థ్యం అని చెప్పారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఎవరిపైనా ఆధారపడకూడదని సూచించారు. ఇది కష్టతరమైనది ఏమీ కాదని అన్నారు. ఈ సందర్భంగా దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోవడంపై కూడా భాగవత్ మాట్లాడారు. గతంలో బ్రిటిష్ వారిపై భారత్ చేసిన పోరాటాల గురించి కూడా వివరించారు.

## నోబెల్ గ్రహీతకు 'అవార్డు' చిక్కులు



**వెనెజువెలా :** ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడో ను వరించిన విషయం తెలిసిందే. డిసెంబర్ 10న నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. అయితే ఈ అవార్డును అందుకునే విషయంలో మరియానా చిక్కులు ఎదురవుతున్నాయి. అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతి స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని వెనెజువెలా అటార్నీ జనరల్ వెల్లడించారు. మరియాపై కుట్రలు, విద్వేషాన్ని ప్రేరేపించడం, ఉగ్రవాదం వంటి ఆరోపణలు, పలు కేసులు ఉండడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కరేబియన్ సహా చుట్టుపక్కల ఉన్న సముద్రాలపై అమెరికా సైనిక దళాల మోహరింపునకు మద్దతు ఇచ్చినందుకు మరియాపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అటార్నీ జనరల్ తన నివేదికలో తెలిపారు. అందుకే ఆమె దేశం దాటి వెళ్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో వచ్చే నెలలో నోబెల్ పురస్కారాన్ని తీసుకునేందుకు మరియా వెళ్లకపోవచ్చని సమాచారం. వెనెజువెలా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి ఆరోపిస్తున్నారు. ఈ ముఠాలతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. దీంతో ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనిక దళాలను రంగంలోకి దింపారు. అగ్రరాజ్యం చేపట్టిన ఈ చర్యలకు మరియా మద్దతివ్వడాన్ని అక్కడి ప్రభుత్వం విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ప్రకటన వెలువడింది. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మరియా కొరీనాకు నోబెల్ శాంతి పురస్కారం ఇస్తున్నట్లు నార్వే కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాదిగా అజ్ఞాతంలోనే ఉంటున్నారని పేర్కొంది. తనను నోబెల్‌కు ఎంపిక చేయడంపై మరియా సోషల్ మీడియా వేదికగా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు తమ పోరాటానికి నిర్ణయాత్మక మద్దతు ఇస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.



## 'ప్రజాస్వామ్యం అంటే ఇలా పనిచేయాలి'

### కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆసక్తికర పోస్ట్

**దిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్‌దానీ ఇటీవల భేటీ అయ్యారు. వీరి మధ్య జరిగిన ఈ స్నేహపూర్వక సమావేశంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ 'ఎక్స్'లో ఆసక్తికర పోస్ట్ చేశారు. ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నప్పటికీ.. తర్వాత ఇద్దరు నేతలు సామరస్యంగా కలవడంపై అభినందనలు తెలిపారు. వారి భేటీకి సంబంధించిన వీడియోను షేర్ చేశారు. "ప్రజాస్వామ్యం అంటే ఇలా పనిచేయాలి. ఎన్నికల్లో మీ సిద్ధాంతం, భావజాలం కోసం ఎంతవరకైనా పోరా డాలి. కానీ ప్రజలు తీర్పు చెప్పిన తర్వాత దేశ ప్రయోజనాల కోసం ఒకరికొకరు సహకరించుకోవాలి. ఇలాంటి స్ఫూర్తిని భారతదేశంలో కూడా చూడాలని కోరుకుంటున్నాను. ఈ విషయంలో నా వంతు కృషి చేయడానికి ప్రయత్నిస్తు న్నాను" అని థరూర్ రాసుకొచ్చారు. దేశంలో వివిధ పార్టీల మధ్య సహకారం లేకపోవడాన్ని పరోక్షంగా విమర్శించేందుకే థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఈ వ్యాఖ్యను సొంత పార్టీ కాంగ్రెస్ వైఖరిని ఉద్దేశించి చేసిన పరోక్ష విమర్శగా భాజపా నాయకులు పేర్కొన్నారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం కోసం కాకుండా దేశం కోసం పనిచేయాలని థరూర్ పరోక్షంగా కాంగ్రెస్ నాయకులకు చురకలంటించారని వ్యాఖ్యానించారు. థరూర్‌పై గత కొన్ని రోజులుగా సొంత పార్టీ నుంచే విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఆయన వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు అధికార భాజపాకు అనుకూలంగా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. పలుమార్లు ఆయన భాజపా సీనియర్ నేత ఎల్‌కే అద్వాణీ, ప్రధాని మోదీని ప్రశంసించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

## డ్రోన్‌లతో పాక్ ఆయుధాలు..

### భారీ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

**న్యూఢిల్లీ :** దేశంలోకి అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న భారీ స్మగ్లింగ్ రాకెట్‌ను దిల్లీ పోలీసులు ఛేదించారు. పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో వీటిని దేశంలోకి తీసుకొస్తున్న ముఠాను పట్టుకున్నారు. పాక్ ఐఎస్‌ఐతో ప్రత్యక్ష సంబంధాలున్న వీరి నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలో కొంతమంది భారీగా అక్రమ ఆయుధాలు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి క్రైమ్ బ్రాంచ్‌కు సమాచారం అందించింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు పలు ప్రాంతాల్లో నిఘా ఉంచగా.. రోహిణిలో ఈ ఆయుధ మాడ్యూల్ గుట్టు బయటపడింది. నిందితులు డ్రోన్‌లను ఉపయోగించి పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పంజాబ్ సరిహద్దుల నుంచి తీసుకొచ్చిన ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్, బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి విదేశాల్లో తయారైన 10 అత్యాధునిక సెమీ ఆటోమేటిక్ పిస్టల్స్‌తో పాటు 92 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. లభ్యమైన ఆయుధాలు తుర్కియే, చైనాలో తయారైనవిగా తెలిపారు. ఈ మాడ్యూల్‌కు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెట్‌వర్క్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఆయుధాలను ఎవరికి విక్రయించారు, నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే వివరాలు తెలుసుకునేందుకు అధికారులు కూపీలాగుతున్నారు. నిందితులకు చెందిన మొబైల్ ఫోన్లు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు. దిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుడుపై దర్యాప్తు కొనసాగుతోన్న క్రమంలో ఈ రాకెట్ గురించి బయటపడటం గమనార్హం.




## అక్రిడిటేషన్ వివాదం..

### న్యాక్‌కు అల్-ఫలా క్షమాపణలు

**న్యూఢిల్లీ :** దిల్లీ పేలుడుకు సంబంధించిన కేసులో అల్-ఫలా యూనివర్సిటీలో పనిచేస్తోన్న కొందరు వైద్యులు నిందితులుగా ఉండడంతో ఈ విశ్వవిద్యాలయంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో అల్-ఫలాకు న్యాక్ అక్రిడిటేషన్ వ్యవహారం కూడా వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా యూనివర్సిటీ స్పందిస్తూ క్షమాపణలు తెలియజేసింది. అక్రిడిటేషన్ వ్యవహారంపై న్యాక్ ఇచ్చిన షోకాజ్ నోటీసులకు తన ప్రతిస్పందనను సమర్పించినట్లు అల్-ఫలా అధికారులు వెల్లడించారు. వెబ్‌సైట్-డిజైన్ లోపాల వల్ల అక్రిడిటేషన్ విషయంలో తప్పు జరిగిందని యూనివర్సిటీ అందులో పేర్కొంది. వెబ్‌సైట్ పర్యవేక్షణ, డిజైన్‌లలో అనుకోకుండా జరిగిన మార్పుల వల్ల వెబ్‌సైట్‌లో న్యాక్ గుర్తింపు గురించి తప్పుడు సమాచారం అలాగే ఉండిపోయిందని.. ప్రస్తుతం ఆయా వెబ్‌పేజీలను తొలగించామని వెల్లడించింది. హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లా ధౌజ్ గ్రామంలో మొదట అల్-ఫలా యూనివర్సిటీని హరియాణా ప్రైవేటు యూనివర్సిటీల చట్టం కింద ఏర్పాటుచేశారు. 1997లో ఇంజినీరింగ్ కాలేజీగా మొదలైంది. 2013లో యూజీసీకి చెందిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ నుంచి 'ఏ' గ్రేడ్ అందుకుందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2014లో రాష్ట్ర ప్రభుత్వం దీనికి యూనివర్సిటీ హోదా కల్పించింది. ఇదే యూనివర్సిటీకి అనుబంధంగా 2019లో అల్-ఫలా మెడికల్ కాలేజీని ఏర్పాటుచేశారు. అయితే అల్-ఫలా యూనివర్సిటీ.. న్యాక్ గుర్తింపు పొందకుండా, కనీసం అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోకుండానే తన వెబ్‌సైట్‌లో కళాశాలకు గుర్తింపు ఉందని బహిరంగంగా ప్రదర్శించడంతో న్యాక్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపైనే విశ్వవిద్యాలయం స్పందించింది. మరోవైపు ఫోర్జరీ, మోసం పేరిట యూనివర్సిటీపై రెండు కేసులు నమోదైన నేపథ్యంలో దిల్లీ పోలీసులు అల్‌ఫలా విశ్వవిద్యాలయ ఛైర్మన్ జావెద్ అహ్మద్ సిద్ధిఖీకి ఇటీవల రెండుసార్లు సమన్లు జారీచేశారు. విశ్వవిద్యాలయ పనితీరు, సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తుల కార్యకలాపాలపై పలు అనుమానాల నేపథ్యంలో ఆయనను విచారిస్తున్నారు. క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేసి ముమ్మర తనిఖీలు చేపట్టారు.

# మరోమారు షాక్ ఇచ్చిన బంగారం ధరలు

## ఒక్కరోజే పది గ్రాములపై 1800 పెరుగుదల



**హైదరాబాద్, నవంబర్ 22 :** బంగారం కొనాలనుకునే వారికి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి భారీగా పెరుగుతున్నాయి. బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.




# 'శత'క్కొట్టిన ట్రావిస్ హెడ్..

## రెండ్రోజుల్లోనే ముగిసిన యాషెస్ తొలి టెస్టు

**పెర్త్:** ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టు రెండు రోజుల్లోనే ముగియగా.. ఇంగ్లిష్ జట్టును ఆస్ట్రేలియా చిత్తు చేసింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 205 పరుగుల లక్ష్యాన్ని కంగారూలు 28.2 ఓవర్లలోనే రెండే వికెట్లు కోల్పోయి ఛేదించారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (123, 83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) టీ20 మ్యాచ్‌లా చెలరేగి ఆడి ఆసీస్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు. మార్నస్ లబుషేన్ (51, 49 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. జేక్ వెదరాల్డ్ (23) పరుగులు చేశాడు. ఆరంభం నుంచే ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన హెడ్.. ఎడాపెడా బౌండరీలు బాదేశాడు. అతను 36 బంతుల్లో అర్ధ శతకం, 69 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. బెన్ స్టోక్స్ వేసిన 17 ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో కలిపి మొత్తం నాలుగు బౌండరీలు రాబట్టాడు. అనంతరం ఆర్చర్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. అట్కిన్సన్ వేసిన 20 ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టి 90ల్లోకి వచ్చేసి కాసేపటికే శతకం పూర్తి చేసుకున్నాడు. హెడ్, లబుషేన్ రెండో వికెట్‌కు 92 బంతుల్లో 117 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్‌లో తొలి రోజే 19 వికెట్లు కూలాయి. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 172 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 123/9తో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 132 పరుగులకు ఆలౌటైంది. 40 పరుగుల ఆధిక్యం సంపాదించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేసింది. గస్ అట్కిన్సన్ (37) టాప్ స్కోరర్. బెన్ డకెట్ (28), ఓలీ పోప్ (33)), బ్రైడన్ కార్స్ (20), జేమీ స్మిత్ (15) పరుగులు చేశారు. ఆసీస్ పేసర్లు బోలాండ్ (4/33), మిచెల్ స్టార్క్ (3/55), డాగెట్ (3/51) సత్తాచాటారు.



### ట్రావిస్ హెడ్ ప్రపంచ రికార్డు

**ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (123, 83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) టీ20 మ్యాచ్‌లా చెలరేగి ఆడాడు. మొదటి నుంచే దూకుడుగా ఆడిన హెడ్.. 36 బంతుల్లో అర్ధ శతకం, 69 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే ట్రావిస్ హెడ్ ఓ ప్రపంచ రికార్డు సృష్టించాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఆటగాడిగా హెడ్ రికార్డుల్లోకెక్కాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఆటగాడూ నాలుగో ఇన్నింగ్స్‌లో 70 కంటే తక్కువ బంతుల్లో సెంచరీ చేయలేదు. 1902లో ఇంగ్లాండ్ బ్యాటర్ గిల్బర్ట్ జెస్సోప్.. ఆస్ట్రేలియాపై 76 బంతుల్లో చేసిన సెంచరీ చేశాడు. ఆ 123 ఏళ్ల రికార్డును తాజా ఇన్నింగ్స్‌తో హెడ్ బ్రేక్ చేశాడు. అంతేకాదు యాషెస్ సిరీస్‌లో వేగవంతమైన సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా హెడ్ ఘనత సాధించాడు. ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ గిల్‌క్రిస్ట్ 57 బంతుల్లోనే (2006 వాకా స్టేడియం) శతకం బాదేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో టెస్టుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ ఓపెనర్‌గా డేవిడ్ వార్నర్ రికార్డును హెడ్ సమం చేశాడు. 2012లో వాకా స్టేడియంలోనే వార్నర్ 69 బంతుల్లోనే శతకం చేశాడు. ఈ మ్యాచ్ 847 బంతుల్లో ముగిసింది. యాషెస్ చరిత్రలో తక్కువ బంతుల్లో ముగిసిన మూడో మ్యాచ్ ఇది. 1888లో ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగిన మ్యాచ్ 788 బంతుల్లో అయిపోగా.. ఇంగ్లాండ్ విజేతగా నిలిచింది. 1888లోనే లార్డ్స్ టెస్టులో ఆస్ట్రేలియా గెలవగా ఆ మ్యాచ్ 792 బంతుల్లో ముగిసింది.**



# బైజూస్ రవీంద్రన్‌కు షాక్..

## 1 బిలియన్ డాలర్ల చెల్లింపునకు యూఎస్ కోర్టు ఆదేశం

**ఢిల్లీ:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు గట్టి షాక్ తగిలింది. బైజూస్ ఆల్ఫా, అమెరికాకు చెందిన రుణదాత గ్లాస్‌ట్రస్ట్ కంపెనీ ఎల్‌ఎల్‌సీ దాఖలు చేసిన పిటిషన్‌పై అమెరికా కోర్టు డిఫాల్ట్ జడ్జిమెంట్ (వాదనలకు ఆస్కారం లేకుండా) వెలువరించింది. పిటిషనర్లకు 1 బిలియన్ డాలర్లను వ్యక్తిగతంగా చెల్లించాలని బైజూస్ రవీంద్రన్‌ను ఆదేశించింది. ఈ మేరకు నవంబర్ 20న తీర్పు వెలువరించింది. తమ తీర్పును రవీంద్రన్ ఉల్లంఘించడం, పట్టించుకోకపోవడంతో ఈ ఆదేశాలు ఇస్తునట్లు డెలావేర్ దివాలా పరిష్కార కోర్టు తన తీర్పులో పేర్కొంది. బైజూస్ పేరిట సేవలందిస్తున్న సమయంలోనే బైజూస్ ఆల్ఫాను 2021లో నెలకొల్పారు. అంతర్జాతీయ రుణదాతల నుంచి నిధుల సమీకరించే ఉద్దేశంతో ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. దీనిద్వారా బైజూస్ ఆల్ఫా 1 బిలియన్ టర్మ్‌లోన్-బిని బైజూస్ పొందింది. అయితే, బైజూస్ ఆల్ఫా టర్మ్‌లోన్ నిబంధనలను ఉల్లంఘించిందని, మొత్తం అప్పులో 533 మిలియన్ డాలర్లు అమెరికా నుంచి చట్టవిరుద్ధంగా తరలించినట్లు రుణదాతలు ఆరోపించారు. ఈ క్రమంలోనే గ్లాస్‌ట్రస్ట్ డెలావేర్ కోర్టును ఆశ్రయించింది. దీంతో బైజూస్ ఆల్ఫాను స్వాధీనం చేసుకునేందుకు గ్లాస్ ట్రస్ట్‌కు కోర్టు అనుమతించింది. బైజూస్ ఆల్ఫా, గ్లాస్ ట్రస్ట్ 533 మిలియన్ డాలర్లకు సంబంధించిన నిధుల లావాదేవీల కోసం మరోసారి కోర్టును ఆశ్రయించాయి. దీంతో సంబంధిత వివరాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిస్కవరీ ఆదేశాల గురించి తెలిసి కూడా రవీంద్రన్ చూసీచూడనట్లు వ్యవహరించారని కోర్టు పేర్కొంది. ఈ విషయంలో కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదని తెలిపింది. ఉద్దేశపూర్వకంగానే రవీంద్రన్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన కోర్టు.. డిఫాల్ట్ ఆదేశాలు జారీ చేసింది. బైజూస్ ఆల్ఫాకు సంబంధించి 533 మిలియన్ డాలర్లు, క్యామ్‌షాఫ్ట్ హెడ్జ్ ఫండ్ ఇంట్రెస్ట్‌కు సంబంధించిన 540.6 మిలియన్ డాలర్ల నిధులను వెంటనే చెల్లించాలని బైజూస్‌ను ఆదేశించింది. ఆల్ఫా ఫండ్లను ఎలా ఖర్చు చేసిందీ వెల్లడించి పూర్తి అకౌంట్ వివరాలు సమర్పించాలని పేర్కొంది. ఈ ఆదేశాలను బైజూస్ రవీంద్రన్ తోసిపుచ్చారు. అప్పీల్‌కు వెళతామని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని బైజూస్ తరఫు లాయర్లు తెలిపారు.

# జీతాలను ఎందుకు దాచాలి

## వ్యాపారవేత్త పోస్ట్ వైరల్



జీతాలను ఎందుకు గోప్యంగా ఉంచాలని కంటెంట్ క్రియేటర్, వ్యాపారవేత్త అంకుర్ వారికూ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ గోప్యత వల్ల పని ప్రదేశంలో గందరగోళం, అభద్రత పెరుగుతుందని రాసుకొచ్చారు. బయటకు వెల్లడించడం వల్ల క్రమశిక్షణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. "పర్సనల్ ఫైనాన్స్‌లో నాకంటూ ఒక గుర్తింపు ఉండటానికి గల కారణం.. డబ్బును ఎప్పుడూ వ్యక్తిగతంగా పరిగణించకపోవడమే. వ్యాపారంలో నా ఆదాయం, పెట్టుబడులు, జీతం, నా పొరపాట్లు ఇలా అన్నింటిని నేను వెల్లడిస్తుంటాను. ఇదంతా ఎవరినో ఆకట్టుకోవడానికి కాదు. మీరు దాచడం మానేసినప్పుడు స్పష్టత ఎలా ఉంటుందో చూపించేందుకు. డబ్బు ప్రైవేటు అంశమని మనం భావిస్తుంటాం. ఈ గోప్యత వల్ల లబ్ధి పొందే సంస్థలే అలాంటి షరతులు పెడుతుంటాయి. జీతాల విషయమే తీసుకోండి.. ప్రతి ఒక్కరికీ తెలిసిన జీతాల అంశాన్ని దాచేందుకు కంపెనీలు భారీగా ఖర్చు చేస్తుంటాయి. ఎందుకంటే వారి జీతాల నిర్ణయాలు పక్షపాతంతో ఉంటాయి. కానీ అలాంటి గేమ్ ఆడేందుకు నేను ఇష్టపడను. నా స్టార్టప్‌లో ప్రతి ఒక్కరి జీతం అందరికీ తెలుసు. దాని వల్ల క్రమశిక్షణ మెరుగవుతుంది. ఎందుకు అంతే జీతం ఇస్తున్నారనే దానిపై నియామకాల సమయంలో స్పష్టత ఇస్తాం. పారదర్శకత అనేది సంస్థల వైఖరి మాత్రమే.. నైతికత కాదు" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. గతంలో వారికూ తన డ్రైవర్ జీతం గురించి బహిరంగంగా వెల్లడించారు. అతడి జీతం ఎలా పెరిగిందో వివరించారు. రానున్న ఐదారేళ్లలో రూ.లక్ష జీతం అందుకోవాలని తాను కోరుకుంటున్నట్లు కూడా చెప్పారు.



# గంభీర్ మీద మాకు పూర్తి నమ్మకముంది

## బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా

టీమ్‌ఇండియా వరుస ఓటములతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అతడిని తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ స్పందిస్తూ.. గంభీర్‌కు మద్దతుగా నిలిచింది. అతడిపై తమకు పూర్తి విశ్వాసం ఉందని వెల్లడించింది. "సెలక్టర్లు, కోచింగ్ బృందం, హెడ్ కోచ్, ఆటగాళ్లపై బీసీసీఐకి పూర్తి నమ్మకముంది. వారికి మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. అందుకే వారు రాణిస్తున్నారు. కానీ, ఏదో ఒక మ్యాచ్ ఓడిపోతే చాలు.. వారి మీద సోషల్ మీడియా వేదికగా విమర్శలు వస్తున్నాయి. అలాంటి వాటిని మేం పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇదే టీమ్‌ఇండియా జట్టుతో మనం ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. ఆసియా కప్‌లోనూ అద్భుత ప్రదర్శన చేశాం. అలాగే ఇంగ్లాండ్‌లో సిరీస్‌ను సమం చేశాం" బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా గుర్తుచేశారు. ఇక, స్పిన్ పిచ్ వివాదంపై టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ కూడా గంభీర్‌కు మద్దతుగా నిలిచాడు. "పిచ్ విషయంలో.. క్యురేటర్లపై విమర్శలు రాకూడదనే గంభీర్ నింద తనపై వేసుకుని ఉంటాడు. ఇతర దేశాల జట్లు.. స్వదేశంలో వారికి అనుకూలమైన పిచ్‌ల మీద ఆడతాయి. అలాగే టీమ్‌ఇండియా కూడా స్పిన్ పిచ్‌లకు ప్రాధాన్యం ఇస్తుంది. సాధారణంగా మ్యాచ్‌లు నాలుగు నుంచి నాలుగున్నర రోజుల వరకు సాగాలని మేం కోరుకుంటాం. మొదటి రెండు రోజులు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తే, తర్వాత పిచ్ నుంచి స్పిన్నర్లకు మద్దతు లభించేలా చూస్తాం" అని సితాన్షు అన్నాడు. అలాగే టీమ్‌ఇండియా బ్యాటర్ల వైఫల్యం గురించి కూడా అతడు మాట్లాడాడు. "అందరూ.. గంభీర్ మీదే విమర్శలు గుప్పిస్తున్నారు. బ్యాటర్లు ఏమి చేశారు? బ్యాటింగ్ కోచ్ ఇంకా ఏం చేయాల్సి ఉందో? ఇలాంటి విషయాలను ఎవరూ ప్రస్తావించడం లేదు. బహుశా ఈ విషయంలో కొంతమందికి వారి వారి వ్యక్తిగత అజెండాలు ఉండొచ్చు" అని సితాన్షు కొటక్ విశ్లేషించాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమ్‌ఇండియా 124 పరుగులను ఛేదించలేకపోయింది. 93 పరుగులకే కుప్పకూలింది. దీంతో దాదాపు 15 ఏళ్ల తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టీమ్‌ఇండియాపై ఓ టెస్ట్ మ్యాచ్ గెలిచింది. ఈ క్రమంలోనే గంభీర్‌పై విమర్శలు తీవ్రమయ్యాయి. అంతేకాదు.. స్పిన్ అనుకూల పిచ్‌ను తయారు చేయమని తానే క్యురేటర్‌ను కోరినట్లు అతడు చెప్పడంతో మరింత వ్యతిరేకత వస్తోంది. ఇక, జట్టులో ఏకంగా ఆరుగురు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లను తీసుకోవడమూ వివాదాస్పదమైంది. దీంతో గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తప్పించాలనే డిమాండ్లూ వినిపిస్తున్నాయి.

# తొలి రోజు సఫారీలదే ఆధిపత్యం..

## 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు



**గువాహటి:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో సఫారీలదే ఆధిపత్యం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా మంచి స్కోరు దిశగా సాగుతోంది. తొలి ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ముత్తుస్వామి (25), కైల్ వెరినె (1) క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా టాప్-4 బ్యాటర్లు ఐడెన్ మార్‌క్రమ్ (38), రికెల్‌టన్ (35), ట్రిస్టన్ స్టబ్స్ (49), తెంబా బావుమా (41) రాణించారు. టోనీ డి జోర్జి (28) పరుగులు చేశాడు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, సిరాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. మ్యాచ్ ప్రారంభంలోనే బుమ్రా బౌలింగ్‌లో (6.2 ఓవర్ వద్ద) మార్‌క్రమ్‌కు లైఫ్‌లైన్ లభించింది. మార్‌క్రమ్ పరుగుల ఖాతా తెరవక ముందే అతడు ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కేఎల్ రాహుల్ ఒడిసి పట్టుకోలేకపోయాడు. తర్వాత ఈ జోడీ నిలకడగా ఆడింది. తొలి వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. సరిగ్గా టీ బ్రేక్‌కు ముందు బుమ్రా వేసిన అద్భుతమైన యార్కర్‌కు మార్‌క్రమ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రెండో సెషన్‌లో మొదలయ్యాక కుల్‌దీప్ వేసిన తొలి ఓవర్‌లోనే రికెల్‌టన్.. వికెట్‌కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం స్టబ్స్, బావుమా నిలకడగా ఆడి రెండో సెషన్‌లో మరో వికెట్ పడకుండా చూసుకున్నారు. దీంతో భోజన విరామ సమయానికి దక్షిణాఫ్రికా 156/2తో నిలిచింది. చివరి సెషన్‌లో సఫారీలు నాలుగు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేశారు. లంచ్ బ్రేక్ తర్వాత జడేజా బౌలింగ్‌లో తెంబా బావుమా.. జైస్వాల్‌కు క్యాచ్ ఇవ్వడంతో 84 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత స్వల్ప వ్యవధిలో స్టబ్స్, వియాన్ ముల్డర్ (13)ని కుల్‌దీప్ పెవిలియ న్‌కు పంపాడు. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా.. సిరాజ్ బౌలింగ్‌లో జోర్జి.. పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు.

# రిషభ్ పంత్‌లో ఆ సత్తా ఉంది : రికీ పాంటింగ్



కోల్‌కతా టెస్ట్‌లో బ్యాటింగ్ చేస్తూ శుభ్‌మన్ గిల్ గాయపడిన విషయం తెలిసిందే. మొదటి మ్యాచ్‌లో రిటైర్డ్ అవుట్‌గా వెనుతిరిగిన అతడు, రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్‌కు రాలేదు. ప్రస్తుతం గువాహటి వేదికగా జరుగుతున్న రెండో మ్యాచ్‌కూ అతడు దూరమయ్యాడు. దీంతో రిషభ్‌పంత్ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. టెస్టుల్లో టీమ్‌ఇండియాకు సారథిగా వ్యవహరించడం పంత్‌కు ఇదే తొలిసారి. ఈ విషయంలో ఆసీస్ మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్.. రిషభ్‌పంత్‌కు మద్దతుగా నిలిచాడు. సిరీస్ మధ్యలో కెప్టెన్‌గా వ్యవహరించడం అంత సులువు కాదన్నాడు. "సిరీస్ మధ్యలో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోవడం అంత తేలికైన విషయం కాదు. ముఖ్యంగా మొదటి టెస్ట్‌లో ఓటమి చవిచూశాక, కీలకమైన మ్యాచ్‌కు సారథ్య బాధ్యతలు నిర్వహించడం సవాలుతో కూడుకున్న పని. అయినా పంత్ తనకున్న అనుభవంతో ఈ పనిని సులువుగా చేయగలడు. ఆ సత్తా అతడిలో ఉందని నమ్ముతున్నా" అని రికీ పాంటింగ్ అన్నాడు. "జట్టులోని ఇతర ఆటగాళ్లకంటే.. వికెట్ కీపర్‌కు మ్యాచ్‌లో ఏం జరుగుతోందనే విషయంపై ఎక్కువ అవగాహన ఉంటుంది. అలాగే పంత్‌కు ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌ను నడిపించిన అనుభవం కూడా ఉంది. కాబట్టి ప్రస్తుత పరిస్థితిని అతడు చక్కగా హ్యాండిల్ చేయగలడనుకుంటున్నా" అని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. రికీ పాంటింగ్ గతంలో దిల్లీక్యాపిటల్స్‌కు కోచ్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో రిషభ్ పంత్ కెప్టెన్సీని అతడు దగ్గర్నుంచి చూశాడు. ఈ నేపథ్యంలోనే పంత్ కెప్టెన్సీ మీద పాంటింగ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఇక.. కోల్‌కతా టెస్ట్‌లో టీమ్‌ఇండియా 124 పరుగులను ఛేధించలేకపోయింది. దీంతో 30 పరుగుల తేడాతో ఓడిపోయింది. 0-1 తేడాతో సిరీస్‌లో వెనుకబడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గువాహటి వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమ్‌ఇండియా తప్పక గెలవాల్సిన పరిస్థితి. అప్పుడే ఈ సిరీస్‌ను డ్రా చేసుకోగలుగుతుంది.




# అమెజాన్‌లో 1800 మంది ఇంజినీర్ల కోత..!

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ 14 వేల కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. క్లౌడ్ సర్వీసెస్, రిటైల్, అడ్వర్టైజింగ్, గ్రోసరీ ఇలా అన్ని విభాగాల్లో ఉద్యోగాలు పోతున్నాయి. ఇక, ఇంజినీర్ల బృందంపై ఈ లేఆఫ్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ భారీ తొలగింపులో 1800 మంది ఇంజినీర్లు ఉన్నారని న్యూయార్క్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్ లేఆఫ్ రికార్డులను బట్టి తెలుస్తోంది. ఆ రాష్ట్రాల్లో 4,700 మందికిపైగా లేఆఫ్ జాబితాలో ఉంటే.. అందులో 40 శాతం మంది ఇంజినీర్లే ఉన్నారు. ఈమేరకు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. మిగతారాష్ట్రాల్లోనూ అమెజాన్ తమ తొలగింపుల డేటాను బహిర్గతం చేస్తే.. ఏఏ విభాగాల్లో ఎంతమందిని తొలగిస్తున్నారనే దానిపై స్పష్టత వస్తుందని పేర్కొంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెద్దఎత్తున ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగాల తొలగింపు గురించి అక్టోబర్‌లో అమెజాన్ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కస్టమర్ల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త పంథాలో ముందుకెళుతున్నామని అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెతత్ గలెట్టి ఉద్యోగులకు రాసిన సందేశంలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బ్యూరోక్రసీని తగ్గించి, అనవసర లేయర్లను తొలగిస్తున్నామని, వనరులను సంపూర్ణంగా వినియోగించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్నది ఏఐ శకం అని అమెజాన్ సీఈఓ యాండీ జెస్సీ పలుమార్లు పేర్కొన్న నేపథ్యంలో ఈ భారీ లేఆఫ్‌ల ప్రకటన వచ్చింది.

www.rajamudranews.com అక్షర రాజముద్ర ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక




## మహిళలు బలహీనులు కాదు..
# బలవంతులు
### నటి రష్మిక మందన్నా కామెంట్స్

ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది.

# ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు...

ఇప్పటి వరకు రెబల్ స్టార్ ప్రభాస్ సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన బాహుబలి భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో ఫౌజీ కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. పౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. మరి ఈసారి హను ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.




# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్
## ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా వారణాసి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. వారణాసిలో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. వారణాసిలో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో రణ కుంభ ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన స్టూడెంట్ నెం.1, యమదొంగ, మగధీర, ఈగ, బాహుబలిలోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక వీరి కాంబోలో వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్‌లోని నాటు నాటు పాట ను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వారణాసికి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్ర తారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# మోహన రాగ మ్యూజిక్ లాంచ్ చేసిన మంచు మనోజ్

టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. ఈసారి సినీ సెట్‌లో కాదు? సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ మోహన రాగ మ్యూజిక్ శనివారం అధికారికంగా లాంచ్ అయింది. చాలా ఏళ్లుగా తన మనసులో దాగి ఉన్న ఈ కల నేడు నెరవేరిందని మనోజ్ భావోద్వేగంగా వెల్లడించారు. ట్విటర్‌లో మోహన రాగ మ్యూజిక్ పేరుతో ఓ సరికొత్త సంగీత సంస్థను ప్రారంభించబోతున్నట్టు చెప్పుకొచ్చారు మంచు మనోజ్. మ్యూజిక్ అంటే తనకు ఎంతో ఇష్టమని? ఈ సంస్థ ద్వారా న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు చెప్పుకొచ్చాడు. లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు. సంగీతం ఎల్లప్పుడూ నా ఎస్కేప్. నా ఎక్స్‌ప్రెషన్, నా నిజం. ఈ రోజు ఆ జర్నీ డెవలప్ అవుతోంది. నా కొత్త ప్రపంచ మ్యూజిక్ వెంచర్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. మోహన రాగ మ్యూజిక్? యంగ్ టాలెంట్, కరేజ్, నిర్భయమైన సృజనాత్మక కోసం నిర్మించాం అని మంచు మనోజ్ స్పష్టం చేశాడు. నటుడిగా ఎన్నో సినిమాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ సంపాదించిన మనోజ్, సంగీతంపై కూడా మంచి పట్టు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. పోటుగాడు సినిమాలో 'ప్యార్ మే పడిపోయా' పాటను స్వయంగా పాడారు. కరోనా సమయంలో విడుదల చేసిన 'అంతా బాగుంటాంద్రా' పాటకు విపరీతమైన స్పందన వచ్చింది అంతేకాదు పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు లిరిక్స్ కూడా రాశారు.అతని స్వరంలో ఉండే సహజమైన ఎమోషన్, సంగీతాన్ని వ్యక్తీకరించే తీరు ప్రత్యేకమని ఆయన అభిమానులు అప్పుడప్పుడూ చెబుతుంటారు. మనోజ్ తండ్రి డాక్టర్ మంచు మోహన్ బాబు, అన్న మంచు విష్ణు, అక్క లక్ష్మీ మంచు సినిమాలకు సంగీతం, యాక్షన్ విభాగాల్లో కూడా పనిచేసిన విషయాన్ని మనోజ్ గుర్తుచేశారు. మోహన రాగ అనే పేరుకు తనకూ, తన కుటుంబానికీ ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు.

## ఆస్కార్ ఎంట్రీ పొందిన
# హోమ్‌బౌండ్




ఆస్కార్ 2026 కు భారత్ తరఫున అధికారిక ఎంట్రీ పొందిన చిత్రం హోమ్‌బౌండ్. ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ విభాగంలో సెలెక్ట్ అయిన ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్ , విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది. 23 చిత్రాలను వెనక్కినెట్టి అకాడమీ అవార్డుకు ఎంట్రీ పొందిన హోమ్‌బౌండ్‌లో ఏముందన్నది చర్చిస్తున్నారు. అది ఉత్తరాదిలోని ఓ గ్రామం. చందన్ కుమార్ (విశాల్ జెత్వా), మహ్మద్ షోయబ్ (ఇషాన్ ఖట్టర్) మంచి స్నేహితులు. వేర్వేరు సామాజిక వర్గాలు, మతాలకు చెందిన వారు సమాజంలో అవమానాలకు గురవుతుంటారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తమకంటూ గుర్తింపు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెడతారు. పోలీసు కావడమే ఇద్దరి లక్ష్యం. అలా కానిస్టేబుల్ పరీక్ష రాసినా.. ఫలితాల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో షోయబ్ ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరతాడు. చందన్ డిగ్రీ చదివేందుకు.. తాను ఇష్టపడిన సుధా భారతి (జాన్వీ కపూర్) చదివే కాలేజీలో జాయిన్ అవుతాడు. ఆ తర్వాత ఊహించని రీతిలో చందన్, షోయబ్ మధ్య మనస్పర్థలొస్తాయి. దానికి కారణమేంటన్నదే కథ. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. స్నేహం, వివక్ష, ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే పోటీ, కొవిడ్ కష్టాలు.. ఇలా పలు పార్శ్వాలతో కూడిన ఈ కథను ఎవరే కోణంలో చూస్తే అదే ప్రధానాంశంగా అనిపిస్తుంది. నెమ్మదిగా సాగినా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. స్నేహితులైన చందన్, షోయబ్‌ల లక్ష్యమేంటన్నది ప్రారంభంలోనే అర్థమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే తీవ్ర పోటీ, పరీక్ష రాసినా ఫలితం తేలకపోతే అభ్యర్థులు పడే మనోవేదన, ఒకవేళ పరీక్షలన్నింటిలో పాస్ అయినా పోస్టింగ్ ఆలస్యం కావడం, చివరకు సర్కారు కొలువుపై ఆశలు వదులుకుని ఏదో ఒక పనిలో చేరడం.. ఇలా మన చుట్టూ జరిగిన, జరుగుతున్న వాటిని కళ్లకు కడుతూ కథలోకి లీనమయ్యేలా చేశారు దర్శకుడు. చందన్ పాత్ర కోణంలో కుల వివక్ష, షోయబ్ పాత్ర వైపు నుంచి మతపరమైన ఇబ్బందులే ప్రధానాంశాలు. స్నేహితుల మధ్య గొడవ జరిగినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా సాగుతుంది. ఇషాన్, విశాల్ ఒకరికొకరు పోటీ పడి నటించారు.




# నా ప్రతి సినిమాలోనూ ఒక సందేశం: బాలకృష్ణ

తాను తీసే ప్రతి సినిమాలోనూ ఒక సందేశం ఉంటుందని నటుడు బాలకృష్ణ అన్నారు. ఆయన ప్రధానపాత్రలో బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి ప్రతినాయకుడిగా నటించారు. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. అందులో బాలకృష్ణ మాట్లాడుతూ.. తనను ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. 'అఖండ 2' సనాతన హైందవ ధర్మం ప్రధానాంశంగా సాగే సినిమా అని చెప్పారు.

# నాగచైతన్య ఎన్‌సి 24 మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్

అక్కినేని నాగ చైతన్య విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం ఎన్‌సి24. ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైథలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీ నుంచి ఇటీవలే బీటీఎస్ వీడియోను షేర్ చేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నవంబర్ 23న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు స్టన్నింగ్ లుక్‌తో క్రేజీ వార్తను షేర్ చేశారు మేకర్స్.ఎన్‌సీ 24 ఫస్ట్ లుక్‌ను టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు లాంచ్ చేయనున్నాడు. నవంబర్ 23న ఆదివారం నాగచైతన్య బర్త్ డే సందర్భంగా ఉదయం 10:08 గంటలకు ఎన్‌సీ 24 టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేయనున్నాడని తెలియజేస్తూ స్పెషల్ లుక్ ఒకటి విడుదల చేశారు. వారణాసి పోస్టర్‌లో చైతూను మహేశ్‌బాబుతో కలిసి డిజైన్ చేసిన పోస్టర్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com